ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి

గరిష్ఠం 30.0
కనిష్ఠం 22.0



యాదాద్రి భువనగిరి

5

శుక్రవారం 7 నవంబరు 2025

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	589.90 (311.7462)	49,104	49,104
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	643.90 (4.17)	5153.78	3936.22
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	174.342 (44.7433)	44,650	52,086

చికెన్ ధరలు | లైవ్ : రూ.148 | డ్రెస్ : రూ.220 | స్కిన్‌లెస్ : రూ.250

ఆరుగాలం శ్రమించిన రైతులు ధాన్యం విక్రయించేందుకు అష్టకష్టాలు పడుతున్నారు. ఈ సీజన్‌లో కురుస్తోన్న వర్షాలు రైతుల ఆశలపై నీళ్లు చల్లుతున్నాయి. ఒకరోజు తెరపి ఇవ్వగానే మరోరోజు చినుకులు పడుతుండటంతో కంటిమీద కునుకులేకుండా పోతోంది. పంట నూర్పిడి సమయంలో వానలు కురుస్తుండటంతో కోత కోసేందుకు సిద్ధమైన రైతులతో పాటు ధాన్యం ఆరబెట్టిన వారు ఆందోళనకు గురవుతున్నారు.
(ఆంధ్రజ్యోతి-యాదాద్రి)



వలిగొండలో ఆరబోసిన ధాన్యం

అన్నదాతకు.. అష్టకష్టాలు

● వరుస వర్షాలతో రైతుల్లో కలవరం ● ధాన్యం విక్రయించే వరకూ గోసే

షరతుల్లేకుండా ధాన్యాన్ని సేకరించాలి



తేమ, రంగు మారిందన్న పేరుతో మిల్లర్లు తీసుకోకుండా ఇబ్బంది పెడుతున్నారు. ప్రభుత్వం ఎలాంటి షరతుల్లేకుండా కొనుగోలు చేయాలి. లేదంటే మా బతుకులు రోడ్డున పడతాయి.
సురేష్, రైతు, గోకారం

జిల్లాలో అన్నిచోట్ల వరి కోతలు ప్రారంభమయ్యాయి. వరుసగా కురుస్తున్న వర్షాలు రైతుల పాలిట కన్నీళ్లు మిగులుస్తున్నాయి. కోతకోసం ఆరబెట్టిన రైతుల పొలాల్లో వర్షంనీరు చేరింది. వాటిని తొలగించేందుకు కర్షకులు పడుతున్న కష్టాలు అన్నీ ఇన్నీ కావు. ధాన్యం విక్రయించేందుకు మార్కెట్‌కు తెచ్చిన రైతుల పరిస్థితి మరో రకంగా ఉంది. పంట కోత కోసినందుకు ఆనందపడాలో... రాశులపై కప్పిన టార్పాలిన్లు తీసేందుకు వర్షం తెరిపి ఇవ్వనందుకు బాధపడాలో రైతులకు బోధపడటంలేదు. జిల్లాలో మొత్తం 17మండలాల్లో 4.60లక్షల ఎకరాల్లో పలు రకాల పంటలను సాగుచేశారు. జిల్లాలో వరితోపాటు పత్తిని అధికంగా సాగుచేస్తారు. వరి, పత్తి కోతకు వచ్చింది. పలు ప్రాంతాల్లో వరితోపాటు పత్తి తీసి.., విక్రయించేందుకు రైతులు సిద్ధంగా ఉంచారు. అయితే వరుసగా కురుస్తోన్న వర్షాలతో వరితోపాటు పత్తిలోనే తేమ శాతం తగ్గడంలేదు. సీసీఐ నిబంధనల ప్రకారం తేమ శాతం లేకుండా ఉంటేనే ధాన్యాన్ని విక్రయిస్తారు. రోజుల తరబడి కల్లాల్లో ధాన్యం, పత్తి ఎండబెడుతూ...వర్షానికి తడవకుండా టార్పాలిన్ల కప్పుతూ రైతులు వారం పది రోజుల్లో కల్లాల్లోనే నిరీక్షించాల్సి ఉంటుంది. వాతావరణ పరిస్థితుల కారణంగా ఈ సారి నవంబరులోనూ వర్షాలకు కురుస్తుండటంతో ఎంతో కష్టపడి పండించిన ధాన్యం విక్రయించేందుకు మునుపెన్నడూ లేనివిధంగా రైతులు ఆందోళన చెందుతున్నారు.

15వేల మెట్రిక్‌టన్నుల పత్తి సేకరణ

జిల్లాలో మొత్తం 1,13,193 ఎకరాల్లో పత్తి సాగుచేశారు. వ్యవసాయశాఖ అధికారుల అంచనా ప్రకారం దాదాపు 9లక్షల మెట్రిక్‌టన్నుల దిగుబడి వస్తుంది. అయితే గత సంవత్సరం సీసీఐ ఆధ్వర్యంలో జిల్లాలో 6లక్షల మెట్రిక్‌టన్నులు సేకరించారు. సీసీఐ జాబితా ఆధారంగా జిల్లాలో మొత్తం 12 జిన్నింగ్ మిల్లులకు ఆలేరులో 3, మోత్కూరులో 6, చౌటుప్పల్‌లో 2, వలిగొండలో 2 మిల్లులు ఉన్నాయి. ఇప్పటివరకు జిల్లాలో 617 మంది రైతుల నుంచి కపాస్ కిసాన్ యాప్ ద్వారా 15,003 మెట్రిక్ టన్నుల పత్తిని సేకరించారు. మరోవైపు పత్తి కొనుగోలు చేయాలని డిమాండ్‌చేస్తూ రైతులు రోడ్డు మీదికి వచ్చి ఆందోళనకు దిగుతున్నారు. వర్షాల నేపథ్యంలో పత్తిలో తేమ శాతం 8-12శాతం వరకు ఉండాలనే నిబంధన సడలించి, మద్దతు ధరలతో కొనుగోలు చేయాలని సీసీఐ అధికారులను కోరుతున్నారు. వర్షానికి తడిసిన పత్తిని రైతులు ఆరబెడుతున్న తేమ శాతం తగ్గడంలేదని 12శాతం కంటే ఎక్కువ ఉన్నా తీసుకోవాలని కోరుతున్నారు.

నల్లబారుతున్న పత్తి

తరచూ వర్షాలు కురుస్తుండటంతో పత్తికాయలు నల్లబారుతున్నాయి. దీంతో పత్తి నాణ్యతతోపాటు దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతోంది. తీతకు వచ్చిన పత్తి వర్షానికి తడిస్తే రంగు మారి నాణ్యత కోల్పోతుంది. తీసిన పత్తి నిల్వ చేసినా... చల్లటి వాతావరణానికి అతి భారీ వర్షాలు పడిన పక్షంలో నాణ్యత కోల్పోయే ప్రమాదం ఉంది. పంట చేతికందే సయమంలో వర్షాలు, భూమిలో అధిక తేమ శాతానికి తోడు సస్యరక్షణ చర్యలకు విఘాతం ఏర్పడటంతో దిగుబడి తగ్గే ప్రమాదం ఏర్పడిందని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. అయితే జిన్నింగ్ మిల్లుల సామర్థ్యం, పత్తి నుంచి దూదిని, గింజలను వేరు చేసి ఇచ్చినందుకు సీసీఐ చెల్లించే మొత్తాన్ని పరిగణలోకి తీసుకుని మిల్లులను ఎల్-1, ఎల్-2 తరహాలో ఎల్-12 వరకు విభజించారు. ఇందులో భాగంగా ఎల్1 కేటగిరీలో గుర్తించిన

..మిగతా 8వ పేజీలో



పత్తి కొనుగోలుకు సీసీఐ కొర్రీలు

● ఆగమవుతున్నరైతులు ● పత్తి కొనుగోలు చేయాలని మోత్కూరులో జిన్నింగ్ మిల్లు ఎదుట రైతుల రాస్తారోకో

పత్తి రైతుపై ఓ వైపు ప్రకృతి కన్నెర్ర చేస్తోంది. మరో వైపు సీసీఐ కొర్రీల మీద కొర్రీలు పెడుతూ ప్రభుత్వ మద్దతు ధరకు పత్తి కొనకుండా పత్తిరైతును ఆగం చేస్తోంది. గతంలో పత్తి జిన్నింగ్ మిల్లులన్నింటిలో సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయగా, ఈసారి మిల్లుల్లో కొన్నింటిలోనే కొనుగోలు కేంద్రాలు ప్రారంభించింది. దీంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.
(ఆంధ్రజ్యోతి-మోత్కూరు)

పత్తి మిల్లుల్లో ఉన్న మౌలిక వసతులు, స్టార్ రేటింగ్ ఆధారంగా జిన్నింగ్ మిల్లులను ఎల్-1, ఎల్-2, ఎల్-3, ఎల్-4గా విభజించినట్లు చెబుతున్నారు. మోత్కూరు మార్కెట్ పరిధిలో ఆరు జిన్నింగ్ మిల్లులు ఉండగా తొలుత రెండు మిల్లుల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేశారు. గురువారం మరో రెండు మిల్లుల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేశారు. ఇంకా రెండింటికి అనుమతి రాలేదంటున్నారు. జిల్లాలో 12 జిన్నింగ్ మిల్లులు ఉండగా ఇప్పటికి ఎనిమిది మిల్లులకు మాత్రమే అనుమతిచ్చినట్లు చెబుతున్నారు.

పత్తిరైతుల రాస్తారోకో

మోత్కూరు మండలం అనాజిపురం జిన్నింగ్ మిల్లులో సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రం ఏర్పాటైంది. గురువారం అందులో విక్రయించడానికి పత్తి రైతులు కపాస్ కిసాన్ యాప్ ద్వారా స్లాట్ బుక్ చేసుకున్నారు. స్లాట్ బుక్ చేసుకున్న మేరకు సుమారు 50మంది రైతులు పత్తి మిల్లు వద్దకు వాహనాల్లో పత్తి తెచ్చారు. పత్తి తేమ శాతం 8 నుంచి 12 ఉండాల్సి ఉండగా 15, 16 శాతం వస్తున్నదంటూ కొనుగోలు చేయడంలేదని రైతులు ఆరోపించారు. పత్తి కొనకపోవడంతో ఆగ్రహించిన రైతులు అదే మిల్లు ఎదుట మోత్కూరు-నార్కట్‌పల్లి రోడ్డుపై రాస్తారోకోకు దిగారు. తాము పత్తి ఆరబెట్టుకునే తెస్తున్నామని, అయినా తేమ శాతం ఎక్కువ ఉందంటూ కొనడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. పత్తి కొనుగోలు చేయకపోవడంతో మళ్లీ తీసుకెళ్లి ఆరబెట్టి తేవాలంటే దిగుమతి, ఎగుమతి ఖర్చులు మీద పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నిబంధనలు సడలించి

..మిగతా 8వ పేజీలో

తేమశాతం ఎక్కువగా ఉందని..

సీసీఐ పత్తిలో తేమ శాతం 12కు మించి ఉంటే కొనుగోలు చేయడంలేదు. ఈ సారి అధిక వర్షాల కారణంగా పత్తిలో సాధారణంగానే తేమశాతం కొంత ఎక్కువగా ఉంటోంది. సీసీఐ పత్తిలో తేమ శాతం 8 ఉంటే ప్రభుత్వ మద్దతు ధర క్వింటా రూ.8,110 చెల్లిస్తుంది. తేమ శాతం 8పైన ఉంటే ఒక్కో శాతానికి రూ.81 చొప్పున తగ్గించి ఇస్తుంది. తేమశాతం 12 దాటితే కొనడం లేదు. ఈ సారి వర్షాలు ఎక్కువగా ఉన్నందున తేమ శాతం పెంచాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు కూడా సీసీఐ సీఎండి దృష్టికి తీసుకెళ్లారు. అయినా సీసీఐ నిబంధనలు సడలించడం లేదు. దీంతో రైతులు పత్తి అమ్ముకోలేక ఇబ్బంది పడుతున్నారు.

ఆయిల్‌పామ్ సాగు లక్ష్యాన్ని సాధించాలి

అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) భాస్కర్‌రావు



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు

భువనగిరి (కలెక్టరేట్), నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆయిల్‌పామ్ సాగు లక్ష్యాన్ని సాధించాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) భాస్కర్‌రావు అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో గురువారం ఉద్యాన, వ్యవసాయ, ఆయిల్‌ఫెడ్, సహకార శాఖల ఆధ్వర్యంలో ఆయిల్‌పామ్ సాగుపై మండల వ్యవసాయ, హార్టికల్చర్ అధికారులు, పీఏసీఎస్ కార్యదర్శులకు నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడారు. ఆయిల్‌పామ్, తోటల పెంపకం సాగు విస్తీర్ణం పెంచి జిల్లాలో రైతుల ఆర్థికాభివృద్ధికి అన్నివిధాల అధికారులు కృషి చేయాలన్నారు. జిల్లాలో ఆయిల్‌పామ్ సాగు 3,500 ఎకరాల్లో సాగు లక్ష్యం ఉందని, రైతులకు ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన కల్పించి సబ్సిడీలు, డ్రిప్ రాయితీలు, అంతర పంటల ఆదాయం వంటి విషయాలను రైతులకు వివరించాలన్నారు. పండ్ల తోటలు, కూరగాయల్లో ఆధునిక సాగు పద్ధతులు, కోల్డ్ స్టోరేజీ, ప్రాసెసింగ్ యూనిట్ సదుపాయాలను అందించాలన్నారు. తక్కువ నీటితో పంట అధిక దిగుబడి కోసం తెలంగాణ మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టు ద్వారా రైతులకు డ్రిప్, స్ప్రింక్లర్లను వర్గాల వారీగా రాయితీతో అందజేస్తున్నట్లు తెలిపారు. నెలలో ఒకరోజు రైతు వేదికలలో మండలస్థాయి అధికారులు సంబంధిత శాఖలతో కలిసి రైతులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా ఉద్యాన శాఖాధికారి మాధవి, జిల్లా వ్యవసాయాధికారి రమణారెడ్డి, సహకార శాఖాధికారి శ్రీధర్, అధికారులు పాల్గొన్నారు.

వేగవంతంగా ధాన్యం కొనుగోళ్లు

● అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వీరారెడ్డి




రికార్డులను పరిశీలిస్తున్న వీరారెడ్డి

రాజాపేట, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): రైతులకు ఎలాంటి సమస్యలు లేకుండా జిల్లాలో 330 కేంద్రాల ద్వారా 40వేల క్వింటాళ్ల ధాన్యాన్ని వేగవంతంగా కొనుగోలు చేశామని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వీరారెడ్డి తెలిపారు. గురువారం తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీచేసి రికార్డులను పరిశీలించారు. భూ భారతి, సాదా బైనామా తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో 318 జీపీవో పోస్టులు ఉండగా, 160 మందిని భర్తీ చేశామన్నారు. 160మంది సర్వేయర్లను లైసెన్స్‌డ్ సర్వేయర్లుగా మండలాలకు కేటాయిస్తున్నట్లు తెలిపారు. ఆయనవెంట డిప్యూటీ తహసీల్దార్ ఉపేందర్, ఆర్ఐ నర్సింహులు ఉన్నారు.

'హలో మాల - చలో ఢిల్లీ' కి తరలిరావాలి

● మాల మహానాడు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చిప్పల నర్సింగ్‌రావు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నర్సింగరావు

భూదాన్‌పోచంపల్లి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : రాజ్యాంగ హక్కుల సాధన సభ ఈ నెల 25, 26న ఢిల్లీలో జరుగుతున్నందున 'హలో మాల- చలో ఢిల్లీ' కార్యక్రమానికి భారీగా తరలిరావాలని మాల మహానాడు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చిప్పల నర్సింగ్‌రావు పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలో చలో ఢిల్లీకి సంబంధించిన పోస్టర్లు, కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. జాతీయ మాల మహానాడు వ్యవస్థాక అధ్యక్షుడు, ఎమ్మెల్సీ డాక్టర్ అద్దంకి దయాకర్ సూచన మేరకు తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మాలకులానికి చెందిన యువత, మహిళలు, ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు, ప్రతిఒక్కరూ కదలి రావాలన్నారు. అంబేడ్కర్ రాసిన రాజ్యాంగాన్ని కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో మాల మహానాడు నాయకులు నూనె మహేష్, సుంకరి కృష్ణస్వామి, నూనె వెంకటేష్, నూనె సాయి, మరాతి నరసింహ, బద్దం లింగస్వామి, కృష్ణ, నూనె బాలకృష్ణ, రమాకాంత్ పెద్దపల్లి, సుంకరి రవి తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలి

● కలెక్టర్ హనుమంతరావు ● బీబీనగర్ మండలం జమీలాపేట గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల పరిశీలన



జమీలాపేటలో ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారులతో మాట్లాడుతున్న కలెక్టర్, ప్రజాదర్బార్‌లో అధికారులతో ఫోన్‌లో సమస్యపై మాట్లాడుతున్న హనుమంతరావు

బీబీనగర్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ హనుమంతరావు లబ్ధిదారులకు సూచించారు. గురువారం బీబీనగర్ మండలం జమీలాపేట గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. గ్రామంలో మంజూరైన ఇళ్ల సంఖ్య, నిర్మాణాలు పూర్తయిన ఇళ్లు, నిర్మాణంలో ఉన్నవి, ఇప్పటికి పనులు మొదలు కాని ఇండ్ల వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. వివిధ దశలో పూర్తయిన వెంటనే డబ్బులు జమ అవుతాయన్నారు. సాధ్యమైనంత తొందరగా గృహ ప్రవేశాలు చేయాలని సూచించారు. ఆయనవెంట తహసీల్దార్ శ్యాం సుందర్‌రెడ్డి, ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డి, హౌసింగ్ ఏఈ, కార్యదర్శులు ఉన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

భువనగిరి (కలెక్టరేట్), నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారమే ప్రజా దర్బార్ లక్ష్యమని కలెక్టర్ హనుమంతరావు అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో ప్రజాదర్బార్ కార్యక్రమంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించి, పరిష్కారం కోసం తక్షణ ఆదేశాలు జారీచేశారు. ప్రజా దర్బార్‌కు బాధితుల తాకిడి అధికమైంది. ప్రతీ గురువారం కలెక్టర్ స్వయంగా బాధితుల నుంచి నేరుగా వారి సమస్యలు, ఫిర్యాదులకు సంబంధించి అర్జీలను స్వీకరించి పరిష్కారం చేయడం, దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలు కూడా కొన్ని తక్షణమే పరిష్కారమవుతున్నాయి. బీబీనగర్‌లోని ఎంప్లాయిస్ కాలనీలో ఇప్పటికే రెండు మద్యం షాపులతో ఇబ్బందులు పడుతున్నామని, ఇప్పుడు మరొకటి నూతనంగా ఏర్పాటు చేస్తుండటంతో మహిళలు, పిల్లలు ఇబ్బందులు పడతారని కాలనీవాసులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో ఎక్సైజ్ సూపరింటెండెంట్‌తో కలెక్టర్ ఫోన్‌లో మాట్లాడి సమస్యను పరిష్కరించారు.

ఘనంగా గంధం ఊరేగింపు



భువనగిరి టౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): భువనగిరిలో ఉర్సు ఉత్సవాలు భక్తిశ్రద్ధల నడుమ కొనసాగుతున్నాయి. ఈ మేరకు కిసాన్‌నగర్‌లోని హజ్రత్ బురానొద్దీన్ అవులియా దర్గాలో గంధం ఊరేగింపు నిర్వహించారు. గంజ్ మజీద్ వద్ద ప్రారంభమైన ఊరేగింపు దర్గా వరకు కొనసాగింది. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు చేసి దర్గాలోని సమాధులకు సమర్పించారు. కార్యక్రమంలో దర్గా ముతావలి ఖాజా ఖుతుబొద్దిన్, ఖాజా బషీరుద్దీన్, అమీన్ ఛైమన్, షేక్ మీరా, ఇంతియాజ్, వసీం, ఎండీ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

నృసింహుడికి శాస్త్రోక్తంగా నిత్య పూజలు

● వైభవంగా లక్ష్మీనృసింహుల కల్యాణం
● అధిక సంఖ్యలో హాజరైన భక్తులు



7

మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి

● సెర్ప్ అదనపు సీఈవో కాత్యాయిని



మాట్లాడుతున్న కాత్యాయిని

బీబీనగర్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ఇందిరా మహిళా శక్తి ద్వారా మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సెర్ప్ అదనపు సీఈవో కాత్యాయిని అన్నారు. గురువారం బీబీనగర్ మహిళా సమాఖ్య భవనంలో నిర్వహించిన ఉల్లాస్ నవ భారత్ సాక్షరత శిక్షణ కార్యక్రమానికి ఆమె హాజరయ్యారు. అనంతరం ఇందిరా మహిళా శక్తి ద్వారా నిర్వహిస్తున్న పాల ఆధారిత ఉత్పత్తుల మిల్క్ పార్లర్, ఆయిల్ మిల్లు యూనిట్లతోపాటు ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంపూర్ణ అక్షరాస్యత సాధించడమే లక్ష్యంగా ఉల్లాస్ పని చేస్తుందన్నారు. వయోజన విద్య ప్రాముఖ్యంపై ప్రతీ ఒక్కరికి అవగాహన కల్పించాలన్నారు. కొత్త పొదుపు సంఘాల ఏర్పాటుతోపాటు మహిళా శక్తి ద్వారా మరిన్ని యూనిట్లను ఏర్పాటు చేసే విధంగా పొదుపు సంఘాల మహిళలకు ప్రోత్సాహం అందించాలన్నారు. స్త్రీనిధి బ్యాంకు, బ్యాంకు లింకేజీ ద్వారా తీసుకున్న రుణాలను వ్యక్తిగత అవసరాలకోసం కాకుండా నెల నెలా ఆదాయం వచ్చే కుటీర పరిశ్రమలు తరహా యూనిట్లు ఏర్పాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అదనపు డీఆర్‌డీవో జంగారెడ్డి, డీపీఎం రవీందర్, ఏపీఎం మీనా, సీసీలు శ్రీలత, నర్మద, పరుశురాం, ప్రజావాణి పాల్గొన్నారు.

నాలుగో రోజూ కళాశాలల బంద్

● సబ్ కలెక్టరేట్ ఎదుట యాజమాన్యాల ధర్నా



డీఏవో రాధకు వినతిపత్రం అందజేస్తున్న కళాశాలల యజమానులు

భువనగిరి రూరల్, నవంబరు6(ఆంధ్రజ్యోతి): ప్రైవేటు, డిగ్రీ, పీజీ కళాశాలల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని యాజమాన్యాలు చేపడుతున్న నిరవధిక బంద్ గురువారం నాలుగో రోజుకు చేరింది. భువనగిరి సబ్ కలెక్టరేట్ కార్యాలయం ఎదుట నిర్వహించిన ధర్నాలో డిగ్రీ, పీజీ కళాశాలల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు దరిపల్లి ప్రవీణ్ కుమార్, నవభారత్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ చిక్క ప్రభాకర్, జాగృతి డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపల్ మణిపాల్‌రెడ్డి మాట్లాడారు. కళాశాలల ఆర్థిక పరిస్థితి రోజురోజుకూ దయనీయంగా మారుతోందని, తక్షణమే ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. అనంతరం సబ్ కలెక్టరేట్ డీఏవో రాధకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ప్రైవేటు కళాశాలల ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.



మధ్యాహ్న భోజన వంట ధరలు

పెరిగాయ్

● ఒకటి నుంచి 8వ తరగతి విద్యార్థులకు మరింత నాణ్యమైన భోజనం అందే అవకాశాలు
● జిల్లాలో 35,725 మంది విద్యార్థులకు, 498 ఏజెన్సీలకు ప్రయోజనం
● పెరిగిన ధరలు గత డిసెంబరు నుంచి అమలు

భువనగిరి టౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం (పీఎం పోషణ్) వంట ధరలను రాష్ట్ర ప్రభుత్వం ఎట్టకేలకు పెంచింది. ఈ పథకంలో కేంద్ర ప్రభుత్వం 60శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40శాతం నిధులు చెల్లిస్తాయి. పెరిగిన ధరలకు అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం 2024, నవంబరు 27న చార్జీలకు పెంచుతూ కేంద్ర విద్యా శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర విద్యాశాఖ ఏడాది ఆలస్యంగా 2025, నవంబరు 4న ఒకటో తరగతి నుంచి అయిదో తరగతి ఒక్కో విద్యార్థిపై 74పైసలు, ఆరు నుంచి ఎనిమిదో తరగతులకు ఒక్కో విద్యార్థిపై రూ.1.12 ధరలు పెంచుతూ ఉత్తర్వులను జారీచేసింది. అయితే పెరిగిన ధరలు 2024, డిసెంబరు ఒకటో తేదీ నుంచి వర్తిస్తాయని ఉత్తర్వుల్లో రాష్ట్ర ప్రభుత్వం పేర్కొంది. దీంతో పెరిగిన చార్జీలను మధ్యాహ్న భోజన ఏజెన్సీలకు బకాయిల రూపంలో ప్రభుత్వం చెల్లించనుంది. కాగా మధ్యాహ్న భోజనానికి అవసరమయ్యే సన్న బియ్యాన్ని ప్రభుత్వాలే అందిస్తున్నాయి. కానీ పప్పు, కూరగాయలు, నూనె తదితర సామగ్రిని ఏజెన్సీలు సమకూర్చుకోవాల్సి ఉంటుంది. మధ్యాహ్న భోజనం ఏజెన్సీలన్నీ మహిళా సంఘాలే నిర్వహిస్తున్న విషయం, ఆ కార్మికులకు నెలకు రూ.3వేలు భృతిగా అందిస్తున్న విషయం విదితమే.

ధరల పెంపు ఇలా..

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిపి ప్రస్తుతం 1 నుంచి 5వ తరగతి విద్యార్థులకు రోజుకు ఒక్కొక్కరికి రూ.5.45 చెల్లిస్తుండగా రూ.6.19కు పెంచారు. 6నుంచి 8వ తరగతి విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.8.17 నుంచి రూ.9.29కి పెంచారు. 9, 10వ తరగతుల విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వమే మధ్యాహ్నం అందిస్తున్నది. అలాగే అన్ని తరగతుల విద్యార్థులకు వారానికి మూడు రోజులు కోడిగుడ్డును రాష్ట్ర ప్రభుత్వమే ఇస్తోంది. ఇందుకు గాను 9, 10వ తరగతుల ఒక్కో విద్యార్థి పేరిట రోజుకు ఏజెన్సీలకు రూ.10.67ను ఒక్కో గుడ్డుకు రూ.6 చెల్లిస్తున్నది.



జిల్లాలో రూ.1.82 కోట్ల పెండింగ్ బిల్లులు

పెరిగిన చార్జీలతో జిల్లాలోని 658 ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 1 నుంచి 8వ తరగతి విద్యార్థులు 35,725 మందికి, 498 మధ్యాహ్న భోజన ఏజెన్సీలకు ప్రయోజనం కలుగనుంది. 9, 10వ తరగతుల విద్యార్థులు 1,989 మంది మధ్యాహ్న భోజనానికి అర్హులుగా ఉన్నారు. నేటి వరకు జిల్లాలోని 658 ఏజెన్సీలకు రూ.1.82కోట్ల పెండింగ్ బిల్లులు రావాలి. ఈ మొత్తంలో ఒకటి నుంచి 8వ తరగతుల భోజనం ఏజెన్సీలకు రూ.1,21,48,086, తొమ్మిది, పదో తరగతి ఏజెన్సీలకు రూ.14,87,830, 1,224 మంది కార్మికుల భృతి రూ.45,30,000 పెండింగ్‌లో ఉంది. పెరిగిన చార్జీల ప్రకారం ఏడాది బకాయిలను పెండింగ్ బిల్లుతో కలిసి ప్రభుత్వం చెల్లించనుంది.

ప్రయాణం.. ప్రాణసంకటం

● ధ్వంసమై గుంతలమయంగా ప్రధాన రహదారులు
● వర్షాలతో నీరు నిలిచి ప్రమాదకరంగా ప్రయాణం
● మంత్రి హెచ్చరికలు పట్టించుకోని టిప్పర్ల యజమానులు

ఇంటి నుంచి వెళ్లిన వ్యక్తి తిరిగి వచ్చే వరకు నమ్మకం లేని పరిస్థితులు నెలకొన్నాయి. ప్రమాదాలకు రహదారులు నిలయాలుగా మారాయి. రంగారెడ్డి జిల్లా మీర్జాగూడ వద్ద రోడ్డుపై గుంతను తప్పించబోయి లారీ, టిప్పర్ ఢీకొన్న ఘటనలో 19 మంది మృతి చెందారు. గల్లీ నుంచి ప్రధాన రహదారుల వరకూ గుంతలమయంగా మారిన దారుల్లో ప్రయాణం నిత్యం ప్రాణ సంకటంగా మారింది. వానలు పడినప్పుడు ఈ తిప్పలు రెండింతలు అవుతున్నాయి. ఎక్కడ ఏ స్థాయిలో గుంత ఉందో తెలియక, రహదారులపై నిలిచిన నీటిలోనే బిక్కుబిక్కుమంటూ సాగిపోవాల్సి వస్తోంది.



బాడీ పరిధిని దాటి టార్పాలిన్ కట్టుకోకుండా వెళ్తున్న టిప్పర్

(ఆంధ్రజ్యోతి-నార్కట్‌పల్లి)

రంగారెడ్డి జిల్లా మీర్జాగూడ వద్ద తాండూరు ఆర్టీసీ బస్సు టిప్పర్ వాహనం ఢీకొన్న ఘటన కొందరికి కడుపుకోత, మరికొందరికి గుండెకోత మిగిల్చింది. బస్సులోని 19మంది ప్రయాణికులు మృతి చెందారు. టిప్పర్ విధ్వంసంతో అమాయకుల ప్రాణాలు కంకరకుప్పలో సమాధయ్యాయి. అయితే ఈ ప్రమాదానికి రోడ్డుపై గుంతలో కారణమని ప్రాథమికంగా తేల్చారు. గుంతను తప్పించబోయే క్రమంలోనే అధికవేగం, అధికలోడుతో వెళ్లిన టిప్పర్ వల్లే ప్రమాదం జరిగిందని భావిస్తున్నారు. ఈ క్రమంలో ప్రభుత్వం అధిక లోడ్‌తో వెళ్లే టిప్పర్‌లపై స్పందించింది. నిబంధనలు పాటించకుండా ఓవర్‌లోడ్‌తో వెళ్లే టిప్పర్‌లపై కేసులు నమోదు చేస్తామని, భారీగా చలాన్లు విధిస్తామని హెచ్చరించింది. ఘటన జరిగిన ఒకటి రెండురోజులు అధికారులు కూడా హడావుడి చేశారు. అయినా టిప్పర్‌ల తీరు మారడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అధికలోడ్ వేసుకోవద్దని, టిప్పర్ లోడుపై తప్పనిసరిగా టార్పాలిన్ కప్పాల్సిందేనని మంత్రి ప్రభాకర్ ఆదేశించారు. ఈ నిబంధనలను ఉల్లంఘించే టిప్పర్‌లపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కానీ నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని కొన్ని గ్రామాల్లోని క్రషర్ కంపెనీల నుంచి నిత్యం నడిచే టిప్పర్ యజమానులు ప్రభుత్వ ఆదేశాలను పట్టించుకోవడం లేదు. ఎప్పటిలాగే ఇష్టానుసారంగా అధికలోడ్‌తో, టార్పాలిన్‌లు లేకుండా మట్టి, కంకరలను తరలిస్తున్నారు. టిప్పర్ బాడీ కన్నా ఎక్కువ ఎత్తులో కంకరను లోడ్ చేసుకుని టార్పాలిన్ లేకుండా ప్రయాణిస్తున్నాయి.



నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు



రోడ్డు భద్రతా నిబంధనలను ఉల్లంఘించి ఓవర్ లోడ్, ఓవర్ స్పీడ్‌గా నడిపే వాహనాలపై కేసులు నమోదు చేస్తాం. కంకర ఇతర లోడును బాడీ లెవెల్‌లో మాత్రమే రవాణా చేయాలి. దాంతో పాటు రోడ్లపై ప్రయాణించే ఇతర వాహనాలు, పాదచారులకు ఇబ్బంది కలగకుండా టార్ఫాలిన్ కట్టుకోవాలి. ఓవర్ లోడ్, ఓవర్ స్పీడ్‌తో వెళ్తే సదరు వాహనాలపై చర్యలు తప్పవు.

దగ్గుల క్రాంతికుమార్, ఎస్ఐ, నార్కట్‌పల్లి

ముగ్గురిని మింగిన కల్వర్టు.. అవ్వాలి అలర్ట్



నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని బాజకుంట గ్రామం వద్ద నార్కట్‌పల్లి-అమ్మనబోలు ఆర్అండ్‌బీ రహదారిపై ఉన్న కల్వర్టు పూర్తిగా దెబ్బతిని ప్రమాదకరంగా మారింది. అడుగుల మేర విచ్చుకుని గుంతలు ఏర్పడ్డాయి. భారీవర్షాల సమయంలో కల్వర్టుపై నుంచి వరద ప్రవహిస్తుంటుంది. ఆ సమయంలో ఏమాత్రం వాహనం అదుపుతప్పినా ప్రమాదం చోటుచేసుకున్నట్టే. అక్టోబరులో ఇదే ప్రదేశం వద్ద ముగ్గురు స్కూటరిస్టులు చనిపోగా, మరికొందరు గాయపడ్డట్లు స్థానికులు తెలిపారు.

(ఆంధ్రజ్యోతి-నార్కట్‌పల్లి)

హద్దు దాటితే.. అంతే

(ఆంధ్రజ్యోతి-మిర్యాలగూడ రూరల్)



కోదాడ-జడ్చర్ల రహదారిపై నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలం తుంగపాడు గ్రామం వద్ద బంధంపై ఏర్పాటుచేసిన బ్రిడ్జి రెయిలింగ్ దెబ్బతింది. ప్రమాదాలకు నెలవుగా కనిపిస్తున్నా ఏడాది నుంచి మరుమ్మతులు చేపట్టలేదు. నిత్యం ఇదే దారిలో వెళ్లే అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోవడం లేదని, వెంటనే పునర్నిర్మాణం చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

మరమ్మతులు చేపట్టాలి



తుంగపాడు బంధంపై వంతెనపై రెయిలింగ్ దెబ్బతిన్న ఏళ్లు గడుస్తున్నా అధికారులు పట్టిం చుకోవడంలేదు. ఎలాంటి ప్రమాదాలు చోటుచేసుకోకుండా వంతెన మరమ్మతు పనులు చేపట్టాలి. సామ రవి (తుంగపాడు)

అటూ ఇటూ ప్రయాణం



యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణం నుంచి వలిగొండకు వెళ్లే రహదారిపై గుంతలు రాకపోకలకు ఇబ్బందికరంగా మారాయి. వర్షాలతో రోడ్డు అస్తవ్యస్తంగా మారింది. హైదరాబాద్-విజయవాడ హైవే నుంచి 100 మీటర్ల వరకు పెద్దపెద్ద గుంతలు ఏర్పడ్డాయి. ఏ దారిన వారు వెళ్లే అవకాశం లేకపోవడంతో అటూ ఇటూ వెళ్తూ ప్రమాదకరంగా ప్రయాణిస్తున్నారు. పాదాచారులు కూడా నరకయాతన అనుభవిస్తున్నారు. గుంతలను పూడ్చివేసి రాకపోకలకు మార్గమం సుగుమం చేయాలని సీపీఎం పట్టణ కార్యదర్శి గోశిక కరుణాకర్ కోరారు.

(ఆంధ్రజ్యోతి-చౌటుప్పల్ టౌన్)

కాలు కదపాలంటే



నల్లగొండ జిల్లా దేవరకొండ పట్టణంలోని పలు వార్డుల్లో రోడ్లు గుంతలమయంగా మారాయి. వర్షాల సమయంలో గుంతల్లో నీరు నిలిచి బయటకు వెళ్లాలంటే ఇబ్బందిగా మారింది. 18వ వార్డు, బొడ్రాయిబజార్, పాత పోలీస్‌స్టేషన్, ముత్యాలమ్మ బజార్‌కు వెళ్లే రోడ్డు, మార్కెట్‌రోడ్డు, గ్రామీణ బ్యాంక్‌కు వెళ్లేదారులు ప్రమాదకరంగా మారాయని స్థానికులు తెలిపారు. రోడ్లకు మరమ్మతులు చేపట్టి సమస్యలను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

. (ఆంధ్రజ్యోతి-దేవరకొండ)

బీఎన్ఆర్ కాలనీలో గుంతలమయమై రోడ్డుపై నిలిచిన వర్షపునీరు

దెబ్బతిన్న డివైడర్



యాదాద్రిభువనగిరి జిల్లాకేంద్రం భువనగిరి పట్టణ ప్రధానరహదారిపై ఉన్న డివైడర్ పలుచోట్ల వాహనాలు ఢీకొని ధ్వంసమైంది. సుమారు రెండున్నర కిలోమీటర్లు ఉన్న డివైడర్‌కు సంబంధించి యూటర్న్, రోడ్డు దాటేందుకు అనువుగా ఉన్న పలుప్రాంతాల్లో వాహనాలు ఢీకొని రాళ్లు తేలడం, కొన్నిరాళ్లు రోడ్డుపైకి జారిపడ్డాయి. ధ్వంసమైన చోట మునిసిపాలిటీ మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

(ఆంధ్రజ్యోతి-భువనగిరి టౌన్)

సాగర్‌లో బేకరీ సీజ్



బేకరీ దుకాణంలో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

నాగార్జునసాగర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా నందికొండ పట్టణంలోని నాణ్యతా ప్రమాణాలు పాటించని మణికంఠ బేకరీ దుకాణాన్ని జిల్లా ఆహార భద్రతా అధికారులు సీజ్ చేశారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశాల మేరకు గురువారం తనిఖీలు నిర్వహించినట్లు జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి శివశంకర్‌రెడ్డి తెలిపారు. బేకరీ నిర్వహిస్తున్న యజమాని ఇంట్లో తనిఖీ చేయగా తినుబండారాల తయారీలో కాలపరిమితి దాటిన ముడి పదార్థాలను వినియోగిస్తున్నట్లు గుర్తించామన్నారు. ఫంగస్ పట్టిన పదార్థాలు, కుళ్లిపోయిన కోడిగుడ్లు, హానికారక రంగులను వినియోగిస్తున్నారని, ఎక్కడా నిబంధనలు పాటించడం లేదని ఆయన తెలిపారు. పక్కనే గురుకుల పాఠశాల ఉండటంతో వీటిని విక్రయిస్తూ విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని, ఈ విషయంలో జాగ్రత్త పడాలని విద్యార్థులకు ఆయన సూచించారు. నిబంధనలు పాటించని బేకరీకి నోటీసులు జారీ చేసి నెల రోజులు సీజ్ చేస్తున్నట్లు శివశంకర్‌రెడ్డి తెలిపారు.

శతవసంత వేడుక

● 102 ఏళ్ల వృద్ధుడికి గ్రామాభివృద్ధి కమిటీ సన్మానం

వందేళ్లు పూర్తి చేసుకున్న ఓ వృద్ధుడిని గ్రామాభివృద్ధి కమిటీ సన్మానించింది. ఆయన జన్మదినాన్ని వేడుకగా జరిపించారు. సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మండలం తొండ గ్రామానికి చెందిన ఓడపల్లి సోమయ్యకు 102 ఏళ్లు. ఆయనకు ముగ్గురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు. మనమళ్లు, మనమరాళ్లు కలిపి 25 మంది. నాలుగు తరాలను చూసిన సోమయ్యను, ఆయన సతీమణి రామక్కతో గురువారం కేక్ కట్ చేయించి, శాలువాతో కమిటీ సన్మానించింది. వందేళ్లు జీవించిన వ్యక్తి గ్రామంలో ఉండటం, వారి అనుభవాలు గ్రామాభివృద్ధికి తోడ్పడతాయని కమిటీ బాధ్యులు గొడుగు రమేష్ తెలిపారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు ఏసీ రెడ్డి, లక్ష్మణ్, వెంకన్న, నరేష్, కృష్ణయ్య, జే మహేష్, ఉప్పలయ్య, యాదగిరి, రవీందర్, రామకృష్ణ, భాస్కర్, బాలరాజు, లక్ష్మయ్య, సోమనర్సయ్య, బిక్షం, మల్లేష్, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

(ఆంధ్రజ్యోతి-తిరుమలగిరి రూరల్)



తొండ గ్రామంలో శతాధిక వృద్దుడు సోమయ్య, సతీమణి రామక్కలను సన్మానిస్తున్న అభ్యుదయ కమిటీ సభ్యులు

కమిషనర్ ఛాంబర్‌లో ఫర్నీచర్ ధ్వంసం

● గుట్ట మునిసిపాలిటీలో దుండగుల దాడి

యాదగిరిగుట్ట రూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రిభువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మునిసిపాలిటీలో గుర్తుతెలియని దుండగులు దాడి చేసి ఫర్నీచర్, కంప్యూటర్‌లను ధ్వంసం చేశారు. కమిషనర్ మిర్యాల లింగస్వామి గురువారం తెలిపిన వివరాల ప్రకారం బుధవారం కార్తీకపౌర్ణమి సెలవు అయినప్పటికీ రోజూ మాదిరే కొంతమంది సిబ్బంది తమ పెండింగ్ పనులు పూర్తి చేసుకుని సాయంత్రం ఇంటికి వెళ్లిపోయారు. పండగ నేపథ్యంలో వాచ్‌మన్ రాత్రి ఇంటికి వెళ్లి మధ్య రాత్రి కార్యాలయానికి వచ్చాడు. అప్పటికే గుర్తుతెలియని దుండగులు కార్యాలయ తాళాలు పగులగొట్టి కమిషనర్ ఛాంబర్‌లోని ఫర్నీచర్, కంప్యూటర్లను, కార్యాలయంలో 13 గదుల తాళాలు పగులగొట్టి అకౌంటెంట్ బీరువా తాళం పగులగొట్టి పలు ఫైళ్లను ధ్వంసం చేసినట్లు గుర్తించాడు. వెంటనే తమకు సమాచారం ఇవ్వడంతో సీఐ భాస్కర్‌కు తెలియజేసినట్లు కమిషనర్ లింగస్వామి తెలిపారు. సంఘటనా స్థలాన్ని క్లూస్‌టీం, సీఐ భాస్కర్ పరిశీలించి ఆధారాలు సేకరించారు. ఆయనతో పాటు శానిటరీ ఎస్ఐ సురేందర్‌గౌడ్, అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ దండు కిరణ్‌బాబు, సిబ్బంది తదితరులు ఉన్నారు.



దుండగుల దాడిలో ధ్వంసమైన ఫర్నీచర్, కంప్యూటర్లు

విద్యుదాఘాతంతో పశువుల కాపరి, గేదె మృతి



మల్లయ్య(ఫైల్)

రామన్నపేట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : విద్యుదాఘాతంతో పశువుల కాపరి, గేదె మృతి చెందాయి. ఈ సంఘటన యాదాద్రిభువనగిరి జిల్లా రామన్నపేట మండలంలో ఈ నెల 5న జరిగింది. తుమ్మలగూడెం గ్రామానికి చెందిన గేదెల కాపరి గొర్ల మల్లయ్య(70) రోజు మాదిరిగానే గేదెలను మేపడానికి వెళ్లాడు. సాయంత్రం ఓ గేదె పొలం వైపు వెళ్లడంతో మళ్లించేందుకు వెళుతూ బురదలో ఉన్న సర్వీసు తీగకు తగిలాడు. దీంతో విద్యుదాఘాతానికి గురై మల్లయ్యతో పాటు గేదె అక్కడికక్కడే మృతి చెందింది. రాత్రి మల్లయ్య ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు వెతికారు. గురువారం ఉదయం బావుల వద్దకు రైతులు మల్లయ్యను చూసి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. పోస్టుమార్టం నిమిత్తం రామన్నపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు..

చిట్యాల, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా చిట్యాల శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందినట్లు ఎస్ఐ రవికుమార్ తెలిపారు. గాంధీ ఆసుపత్రి చికిత్సపొందుతున్న అక్కను చూసేందుకు సూర్యాపేట జిల్లా కేంద్రానికి చెందిన పంతం సువర్ణరాజు(19) మంగళవారం రాత్రి 10గంటల ప్రాంతంలో సూర్యాపేట నుంచి ద్విచక్రవాహనంపై హైదరాబాద్‌కు బయలుదేరాడు. చిట్యాల శివారులో అర్ధరాత్రి దాటిన తరువాత గుర్తుతెలియని వాహనం ఢీకొని తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. సువర్ణరాజు తండ్రి లింగయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

తప్పిన పెనుప్రమాదం



ప్రమాదంలో దెబ్బతిన ఆర్టీసీ బస్సు

ఆత్మకూరు(ఎం), నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రిభువనగిరి జిల్లాలో ఆర్టీసీ బస్సుకు పెను ప్రమాదం తప్పింది. ఆత్మకూరు(ఎం) మండలం రాయిపల్లి మూలమలుపు వద్ద గురువారం ఇసుక లారీ తగలడంతో ఆర్టీసీ బస్సు పాక్షికంగా దెబ్బతింది. ఆర్టీసీ డ్రైవర్ రాజు తెలిపిన వివరాల ప్రకారం తొర్రూర్ డిపోకు చెందిన డీలక్స్ బస్సు మోత్కూరు నుంచి ఉప్పల్‌కు వెళ్తోంది. రాయగిరి నుంచి మోత్కూరు వైపునకు వస్తున్న ఇసుక లారీ ఆత్మకూరు(ఎం) మండలం రాయిపల్లి మూలమలుపు వద్దకు రాగానే అతివేగంతో ఆర్టీసీ బస్సును తాకుతూ వెళ్లింది. దీంతో బస్సులో ఉన్న ప్రయాణికులు గట్టిగా కేకలు వేయడంతో బస్సును నిలిపారు. బస్సు కుడివైపు పాక్షికంగా దెబ్బతింది. అప్పటికే లారీ వెళ్లిపోవడంతో డ్రైవరు డయల్-100కు ఫోన్ చేసి విషయం చేరవేశాడు. కప్రాయపల్లి వద్ద పోలీసులు లారీ ని పట్టుకొని పోలీస్టేషన్ తరలించారు. బస్సులో ఉన్న 24 మంది ప్రయాణికులకు ఎలాంటి గాయాలు కాలేదు. ఇతర బస్సులలో వారిని గమ్యస్థానానికి తరలించారు. బస్సుకు జరిగిన నష్టాన్ని భరిస్తానని లారీఓనర్ అంగీకరించడంతో సమస్య సద్దుమణిగింది.

ఫిట్‌నెస్ లేని వాహనాలు సీజ్

చౌటుప్పల్ రూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం దండుమల్కాపురం శివారు హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై జిల్లా రవాణాశాఖ అధికారులు వాహన తనిఖీలు నిర్వహించారు. ఫిట్‌నెస్ సెంటర్ వద్ద పలు వాహనాలను నిలిపి తనిఖీచేశారు. ఓవర్ లోడ్‌తో వెళ్తున్న వాహనాలు, ఫిట్‌నెస్ లేని వాహనాలను సీజ్ చేశారు. ఈ సందర్భంగా రవాణాశాఖ అధికారులు మాట్లాడుతూ వికారాబాద్‌లో జరిగిన సంఘటన నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా రవాణా శాఖ ఆధ్వర్యంలో డ్రంకెన్ డ్రైవ్‌లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఫిట్‌నెస్ లేని వాహనాలపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

మోసాలకు పాల్పడుతున్న వ్యక్తి అరెస్ట్



కేసు వివరాలు వెల్లడిస్తున్న పట్టణ ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య

సూర్యాపేటక్రైం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ ట్రేడింగ్, ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మించి డబ్బులు వసూలు చేసి మోసాలకు పాల్పడుతున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు సూర్యాపేట పట్టణ ఇన్‌స్పెక్టర్ ఏ వెంకటయ్య తెలిపారు. గురువారం రాత్రి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలు వెల్లడించారు. సూర్యాపేట పట్టణ పరిధిలోని భాషానాయక్ తండాకు చెందిన ప్రస్తుతం తిరుమలగిరి మునిసిపల్ కేంద్రంలో నివసిస్తున్న గడ్డం లక్ష్మణ్‌కుమార్ కొంతకాలంగా మాయమాటలతో మోసం చేస్తున్నాడు. సూర్యాపేట, తిరుమలగిరి, హైదరాబాద్, నెల్లూరు ప్రాంతాల్లో ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో పెట్టుబడులు, వివిధ ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగాలు ఇప్పిస్తానని అమాయక ప్రజలను నమ్మించి వారి వద్ద నుంచి డబ్బులు తీసుకుని మోసగిస్తున్నట్లు తెలిపారు. సూర్యాపేట పట్టణంలో ఒక మహిళను కూడా ఉద్యోగాల పేరుతో నమ్మించి వారి వద్ద నుంచి లక్షల రూపాయలు వసూలు చేసి మోసగించాడని సీఐ తెలిపారు. ఇలా సుమారు రూ.3 కోట్ల వరకు వసూలు చేశాడని, బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితుడు లక్ష్మణ్‌కుమార్‌ను గురువారం పట్టణ ఎస్ఐ శివతేజ తన సిబ్బందితో కలిసి తిరుమలగిరి పట్టణంలో ఉండగా అరెస్ట్ చేసినట్లు తెలిపారు. సమావేశంలో పట్టణ ఎస్ఐ శివతేజ, సిబ్బంది శ్రీరాములు ఉన్నారు.

ముగ్గురు జూదరుల అరెస్ట్

తుర్కపల్లి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : పేకాడుతున్న ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు యాదాద్రిభువనగిరి జిల్లా తుర్కపల్లి ఎస్ఐ తక్యుద్దీన్ తెలిపారు. గోపాల్‌పూర్ గ్రామంలో గురువారం పేకాట స్థావరంపై దాడి చేసి బక్కల కనకయ్య, బక్కల రమేశ్, మందరి నవీన్‌ను అదుపులోకి తీసుకోని పోలీస్‌స్టేషన్‌కు తరలించామన్నారు. నిందితుల నుంచి రూ.2,040లు నగదు, ఐదు సెల్‌ఫోన్లు, ఒక పేకముక్కల సెట్‌ను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

కలెక్టర్ ఆదేశాలతో ఎంపీడీవో విచారణ



విచారణ జరుపుతున్న ఎంపీడీవో

కొండమల్లేపల్లి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : పింఛన్లు సక్రమంగా పంపిణీ చేయడం లేదన్న ఫిర్యాదులపై నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లి మండలంలోని దేవరోనితండాలో అధికారులు విచారణ చేపట్టారు. తపాలా సిబ్బంది జహంగీర్ రెండు, మూడు నెలలకు ఒకసారి పింఛన్లు చెల్లిస్తున్నాడని నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠికి గురువారం గ్రామస్థుడు ఫిర్యాదు చేశారు. దీంతో విచారణ చేపట్టాలని ఎంపీడీవో స్వర్ణలతను కలెక్టర్ ఆదేశించారు. ఈ నేపథ్యంలో ఎంపీడీవోతో పాటు ముగ్గురు కార్యదర్శులు కలిసి తండా వాసుల నుంచి వివరాలు సేకరించారు. సక్రమంగా పింఛన్లు పంపిణీ చేయడం లబ్ధిదారులు తెలపడంతో జహంగీర్‌ను గ్రామానికి పిలిపించి విచారించారు. అయితే ప్రతి నెలా సక్రమంగా చెల్లిస్తున్నట్లు జహంగీర్ తెలిపారు. ఈ క్రమంలో తండాకు చెందిన రాజు, జహంగీర్‌ల మధ్య వాగ్వాదం పెరగడంతో జహంగీర్‌పై రాజు చేయిచేసుకున్నాడు. తనపై దాడి చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని ఆందోళన వ్యక్తం చేశారు. పింఛన్ల ఉదంతంపై నివేదికను కలెక్టర్‌కు పంపిస్తామని, వారి ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. విచారణలో పంచాయతీ కార్యదర్శులు డాకునాయక్, సరస్వతి, కిరణ్ తదితరులున్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

బొమ్మలరామారం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రిభువనగిరి జిల్లా బొమ్మలరామారం మండలానికి చెందిన వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. బొమ్మలరామారం మండలం రామలింగంపల్లి గ్రామస్థులు గురువారం తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన పలుకు రమేష్(48) గ్రామానికి పక్కనే ఉన్న మేడ్చల్ జిల్లా కీసర మండలం అంకిరెడ్డిపల్లి గ్రామానికి గేదెలు మేపేందుకు కూలీ పనినిమిత్తం వెళ్లాడు. ఉదయం వెళ్లిన రమేష్ సాయంత్రమైనా రాకపోవడంతో కుమారుడు అంకిరెడ్డిపల్లి గ్రామ రెవెన్యూ పరిధి ప్రాంతంలో వెతికాడు. అనుమానాస్పద స్థితిలో పడిఉండడం గమనించి గ్రామస్థులకు, మేడ్చల్ జిల్లా కీసర మండలం పోలీసులకు సమాచారం అందించాడు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. సంఘటనా స్థలంలో రమేష్ పర్సు, డబ్బులు వేర్వేరు ప్రదేశాల్లో పడి ఉండటంతో గుర్తు తెలియని వ్యక్తులు హత్య చేసి ఉంటారని కుటుంబ సభ్యులు అనుమానిస్తున్నారు. క్లూస్‌టీంను రప్పించాలని సంఘటనా స్థలంలో ఆందోళన చేశారు. పోలీసులు వారికి నచ్చజెప్పి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించినట్లు గ్రామస్థులు తెలిపారు.

పేరుకే విలేకరి.. చేసేది దొంగతనం



వివరాలు వెల్లడిస్తున్న సీఐ రాజు, ఎస్ఐ రాంమూర్తి

చింతపల్లి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఓ పత్రికలో విలేకరిగా పనిచేస్తున్నట్లు కనిపిస్తూనే చోరీలకు పాల్పడుతున్న వ్యక్తిని నల్లగొండ జిల్లా చింతపల్లి పోలీసులు అరెస్ట్ చేశారు. నాంపల్లి సీఐ రాజు, చింతపల్లి ఎస్ఐ రాంమూర్తి తెలిపిన వివరాల ప్రకారం చింతపల్లి మండలకేంద్రానికి చెందిన షేక్ అలీ ఓ పత్రికలో విలేకరిగా పనిచేస్తున్నాడు. 2019లో చింతపల్లి తహసీల్దార్ కార్యాలయంలో రెండు కంప్యూటర్లతో పాటు ఎల్‌ఈడీ స్క్రీన్‌ను చోరీ చేశాడు. తహసీల్దార్ సునంద ఫిర్యాదుమేరకు పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు ప్రారంభించారు. సాంకేతిక పరిజ్ఞానం, ఫింగర్ ప్రింట్స్ ఆధారంగా చోరీలకు పాల్పడిన వ్యక్తి విలేకరిగా పనిచేస్తున్న అలీగా గుర్తించారు. మర్రిగూడ మండలం శివన్నగూడకు చెందిన గ్యార రమణతో కలిసి చోరీలకు పాల్పడేవాడని, రంగారెడ్డి జిల్లా యాచారం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు సీఐ, ఎస్ఐలు తెలిపారు. అదేవిధంగా వాడపల్లి పోలీస్‌స్టేషన్‌లో చీటింగ్ కేసుతో పాటు రాత్రివేళ కారు బ్యాటరీలు చోరీ చేస్తూ విలాసవంతమైన జీవితాన్ని గడిపేవాడని తెలిపారు. నిందితుడి నుంచి మానిటర్, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

జాతీయ మల్లకంబ్ పోటీలకు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ మంజుల, చైర్మన్ కృష్ణారావు

చౌటుప్పల్ టౌన్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణంలోని ట్రినిటీ విద్యాసంస్థలకు చెందిన ముగ్గురు విద్యార్థులు మల్లకంబ్(పోల్‌పై యోగా) జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. రాష్ట్రజట్టుకు ఎంపికైన విద్యార్థులు ఈ నెల 24, 25వ తేదీల్లో మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయినిలో నిర్వహించే జాతీయ పోటీల్లో పాల్గొంటారు. 69వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో చౌటుప్పల్ పట్టణంలో ఈ నెల 4, 5వ తేదీల్లో మల్లఖంబ్ రాష్ట్రజట్టు ఎంపిక పోటీలు నిర్వహిం చారు. 17 సంవత్సరాల బాలుర విభాగంలో శ్రీహర్ష, 14 సంవత్సరాల బాలుర విభాగంలో బి. చరణ్ సాయి, విఘ్నేష్ ఎంపికయ్యారు. మరో ఐదుగురు విద్యార్థులు స్టాండ్‌బైగా ఎంపికయ్యారు. విద్యార్థులను ట్రినిటీ విద్యాసంస్థల ప్రిన్సిపాల్ మంజుల, చైర్మన్ కృష్ణారావు తదితరులు అభినందించారు.

హ్యాండ్‌బాల్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

తిప్పర్తి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా తిప్పర్తి మండలంలోని మామిడాల పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. 69వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ హ్యాడ్‌బాల్ ఉమ్మడి జిల్లా సెలక్షన్‌లో 14 సంవత్సరాల బాలికల విభాగంలో జెర్రిపోతుల కీర్తి, బాలుర విభాగంలో బుచ్చాల రామ్‌చరణ్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం కొమరాజు యాదగిరి తెలిపారు. నారాయణపేట జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఫిజికల్ డైరెక్టర్ బెడుదూరి సురేందర్‌రెడ్డిని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, విష్ణు, శ్రీనివాస్, ఖైరొద్దీన్, సైదయ్య, జగన్మోహనరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అండర్-17 విభాగంలో..



కట్టంగూరు: నల్లగొండ జిల్లా కట్టంగూరు మండలంలోని చెర్వు అన్నారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థిని చిలుముల శివాని అండర్-17 విభాగంలో రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైంది. ఈ నెల 4న చెర్వుఅన్నారం ఉన్నత పాఠశాలలో నిర్వహించిన 69వ ఎస్‌జీఎఫ్ ఉమ్మడి జిల్లా స్థాయి బాలబాలికల హ్యాండ్‌బాల్ పోటీల్లో పాల్గొని రాష్ట్రస్థాయికి ఎంపికైందని ఆ పాఠశాల హెచ్‌ఎం కందాల రమ, వ్యాయామ ఉపాధ్యాయుడు చింతమల్ల పుల్లయ్య తెలిపారు. ఈ నెల 7 నుంచి 9వ తేదీ వరకు కోస్గిలో జరిగే రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో పాల్గొంటుందని తెలిపారు. విద్యార్థినిని హెచ్‌ఎం వ్యాయామ ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు రాంమోహన్‌రెడ్డి, శ్రీనివాస్, కోటిలింగం, నరహరి, లింగయ్య, సంపత్‌కుమార్, మంగ అభినందించారు.

రాష్ట్రస్థాయి డ్యాన్స్ పోటీల్లో తృతీయ బహుమతి



సమగ్రశిక్ష ప్రాజెక్టు డైరెక్టర్ నుంచి బహుమతులు అందుకుంటున్న విద్యార్థులు

కట్టంగూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): టీజీఐఆర్‌డీ సంస్థ ఆధ్వర్యంలో సమగ్ర శిక్ష రాష్ట్రస్థాయి కళా ఉత్సవ్ కాంపిటీషన్-2025 పోటీలు గురువారం హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్‌లో నిర్వహించారు. డ్యాన్స్ విభాగంలో నల్లగొండ జిల్లా కట్టంగూరు కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం 10వ తరగతి విద్యార్థులు లక్ష్మీప్రసన్న, నిమిష, ప్రియాంక, వైష్ణవి రాష్ట్రస్థాయి తృతీయ బహుమతికి ఎంపికయ్యారు. విద్యార్థులకు సమగ్ర శిక్ష రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ నవీన్ నికోలస్, అడిషనల్ స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్ ఎం. రాధారెడ్డి నగదు రూ.2వేల నగదుతో పాటు ప్రశంశా పత్రాలు అందజేశారు. విద్యార్థులను పాఠశాల ఎస్‌వో నీలాంబరి, ఉపాధ్యాయులు అభినందించారు.

జోనల్‌స్థాయి క్రీడలు ప్రారంభం



వాలీబాల్‌లో తలపడుతున్న క్రీడాకారులు

రాజాపేట, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 11వ జోనల్ స్థాయి క్రీడా పోటీలు యాదాద్రి భువనగిరి జిల్లా రాజాపేట మండలకేంద్రంలోని బీసీ గురుకుల పాఠశాలలో గురువారం ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను డీసీవోలు శ్రీనివాసరావు, సుధాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులు మార్చ్‌ఫాస్ట్ నిర్వహించారు. ప్రతి క్రీడాకారుడు క్రీడాపోటీలను స్ఫూర్తిగా తీసుకొని రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదుగాలన్నారు. కార్యక్రమంలో క్రీడల సమన్వయ కర్త శ్రీనివాస్, వైస్ ప్రిన్స్‌పాల్ వేణుప్రసాద్, పీడీ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక దొరక్క..



నల్లగొండ జిల్లా మాడ్గులపల్లి మండల ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఇసుక కొరత ఏర్పడింది. ఆగామోత్కూర్, బీమనపల్లి, కల్వలపాలెం, చిరుమర్తి, పాలేరు వాగుపై ఉన్న చెక్‌డ్యామ్‌లు అలుగుపోయడంతో ఇసుక దొరకకపోవడంతో లబ్ధిదారులు అవస్థలు పడుతున్నారు. దీంతో ఆగామోత్కూర్ వాగులో నుంచి ఇసుకను వాగుఒడ్డుకు వేసి ఎడ్లబండి సాయంతో ఇసుక తరలిస్తున్నారు. ఒక్కో ఎడ్ల బండికి దూరాన్ని బట్టి అదే గ్రామంలో అయితే రూ.500, పక్క గ్రామాలకు తరలిస్తే రూ. 1,100 నుంచి రూ.1,500 వరకు తీసుకుంటున్నారు. ● ఆంధ్రజ్యోతి -మాడ్గులపల్లి

లిఫ్ట్ పనులు నీటి మూటలే

● నత్తనడకన తోపుచర్ల లిఫ్టు పనులు ● పూర్తయితే 316 ఎకరాలకు నీరు ● మరో 500 ఎకరాలు సాగులోకి వచ్చే అవకాశం



కొనసాగుతున్న తోపుచర్ల పంప్‌హౌస్ పనులు

మాడ్గులపల్లి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): భూగర్భజలాలు పెంపొందించాలనే లక్ష్యంతో ఎత్తిపోతల పథకాలు మంజూరు చేసినా పనులు ముందుకు సాగడంలేదు. లిఫ్ట్ పనులు పూర్తిచేసి చెరువులు నింపుతామని ఎన్నికల సమయంలో గ్రామాల్లోకి వచ్చి నాయకులు ప్రచారం చేసిన మాటలు నీటి మూటలుగా మిగులుతున్నాయి. రూ.10కోట్లతో తోపుచర్ల లిఫ్టు పనులు చేపడతామని గత ప్రభుత్వం ప్రకటించినా అధికారులు మాత్రం పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. లిఫ్టు పనులు పూర్తయితే మేలు జరుగుతుందనుకున్నా పనులు నత్తనడకగా కొనసాగడంతో రైతులు అయోమయంలో ఉన్నారు. నల్లగొండ జిల్లా మాడ్గులపల్లి మండలంలోని నాగార్జునసాగర్ ఎడమకాల్వ ఎల్-14 స్టేజ్ 1-పంప్ హౌస్ నుంచి తోపుచర్ల, పుచ్చకాయలగూడెం, సీత్యాతండా, దేవతల బావిగూడెం, గణపతివారిగూడెం, బొమ్మకల్ గ్రామాల గొలుసు కట్టు చెరువులు నింపేందుకు లిఫ్టు మంజూరైంది. భూములు సర్వే చేసి వేములపల్లి మండల పరిధిలోని ఎల్-14 స్టేజ్-1 పంప్‌హౌస్ నుంచి తోపుచర్ల, పుచ్చకాయలగూడెం వరకు 5.6 కిలో మీటర్ల మేర భూగర్భ పైపులైన్ వేసి చివరి చెరువులకు నీటిని నింపేందుకు వీలుగా ఉంటుందని అధికారులు ప్రతిపాదించారు. తోపుచర్ల గ్రామంలోని పెద్ద చెరువు, చిన్న చెరువు, సీత్యాతండా చెరువు, గణపతివారి గూడెం చెరువు, దేవతల బావిగూడెం చెరువు, బొమ్మకల్ చెరువులోకి నీటిని నింపడం ద్వారా సాగు, తాగునీటి కష్టాలు తీరతాయని అను కున్న రైతులకు నిరాశే మిగిలింది. ఇప్పటివరకు లిఫ్టు పనులు పూర్తికాక వ్యవసాయ ఆధారమైన పత్తి, వరిపంటను సేద్యం చేస్తున్నారు. ఆరు చెరువులను నింపడం ద్వారా 316 ఎకరాలకు నీరందే అవకాశమున్నా అనుకున్న స్థాయిలో పనులు జరగకపోవడంతో రైతులు నిరాశ చెందుతున్నారు. లిఫ్టు పనులు పూర్తయి చెరువులోకి నీరు చేరి భూగర్భజలాలు వృద్ధి చెందడంతోపాటు బోరుబావుల కింద సుమారు మరో 500ఎకరాలు సాగులోకి వచ్చే అవకాశముందని రైతులు భావిస్తున్నారు. ప్రభుత్వం ఏర్పడిరెండు సంవత్సరాలు అయినా లిఫ్టు పనుల్లో పంప్‌హౌస్ పనులు మాత్రమే పూర్తయిందని అధికారులు పేర్కొన్నారు.

పైపులైన్ పనులు త్వరలో చేపడతాం

మాడ్గులపల్లి తోపుచర్ల లిఫ్టు పంప్‌హౌస్ పనులు నడుస్తున్నాయి. ఎక్కువ మంది రైతులు వరి పొలాలు వేయడంతో పైపులైన్ పనులకు ఆటంకం ఏర్పడుతుంది. వేసవి వరి కోతల తర్వాత పైపులైన్ పనులను ప్రారంభించి రైతులకు ఇబ్బందులు లేకుండా చూస్తాం.

వి. శివకుమార్, ఎన్ఎస్‌పీ డీఈఈ.

పైపులైన్‌కు అడ్డంకిగా..



ఎల్-14 సెకండ్ స్టేజ్ పంప్‌హౌస్

ఎల్-14 స్టేజ్1 పంప్‌హౌస్ నుంచి పుచ్చకాయలగూడెం వరకు 5.6 కిలో మీటర్ల పైపులైన్ పనులు ప్రారంభానికి నోచుకోలేదు. గత ప్రభుత్వంలో లిఫ్టు పనులను పూర్తిచేసినా ఇప్పటివరకు పైపులైన్ పనులకు మోక్షం కలగలేదు. పంప్‌హౌస్ నుంచి పుచ్చకాయలగూడెం వరకు 5.6 కిలో మీటర్ల మేరా ఉన్న పైపులైన్‌కు వ్యవసాయ భూములు అడ్డంకిగా మారింది. ఈ సీజన్‌లో వర్షాలు సమృద్ధిగా కురవడంతో 5 కిలో మీటర్ల మేరా ఉన్న భూముల్లో రైతులు వరి పంటలను సాగు చేశారు. కోతలు కోసినా మళ్లీ వేసవి పంటకు రైతులు నార్లు పోసుకొని వ్యవసాయం చేసుకోవాల్సిన పరిస్థితి ఉంది. దీంతో పైపులైన్ ఏర్పాటు ప్రక్రియ ఈ సీజన్‌లో జరిగే అవకాశం లేదు. రైతులతో మాట్లాడి పైపులైన్ పనులను చేపడితే పైపులైన్ ఏర్పాటు పూర్తవుతుందని లేకపోతే ఇప్పట్లో పూర్తయ్యే అవకాశం లేదని తెలుస్తోంది.

తోపుచర్ల లిఫ్టు పనులు పూర్తిచేయాలి



తోపుచర్ల లిఫ్టు పనులు త్వరగా పూర్తిచేయాలి. నీటి కోసం ప్రతిసారి ఇబ్బందులు పడుతున్నాం. వర్షాలు సమృద్ధిగా కురవడంతో చెరువుల్లోకి నీరు రావడంతో వ్యవసాయం చేసుకోగలుగుతున్నాం. లిఫ్టు పనులు ప్రారంభించి రెండేళ్లవుతున్నా ఇప్పటివరకు అధికారులు పూర్తి చేయడం లేదు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి లిఫ్టు పనులను పూర్తిచేసి చెరువులను నింపాలి.

మారుతి వెంకట్‌రెడ్డి, రైతు, బొమ్మకల్

కాల్వ వెంట మట్టి మాయం

● అనుమతి లేకుండా ఏఎమ్మార్పీ కాల్వ వెంట మట్టి తరలింపు ● పట్టించుకోని అధికారులు



ఏఎమ్మార్పీ ప్రధాన కాలువ వెంట చామలోనిబావి వద్ద మట్టి దిబ్బలు తరలింపుతో ఏర్పడిన గుంతలు

గుర్రంపోడు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ఏఎమ్మార్పీ ప్రధాన కాల్వ వెంట మట్టి దిబ్బలు మాయమవుతున్నాయి. ఏళ్ల తరబడి ఈ తంతు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో ప్రభుత్వ ఆదాయానికి భారీగా పడుతోంది. నిబంధనల ప్రకారం మట్టికోసం మైనింగ్‌శాఖకు దరఖాస్తు చేసుకుంటే ఆ శాఖ నుంచి నీటిపారుదలశాఖ ద్వారా మట్టి లభ్యతను గుర్తించాల్సి ఉంటుంది. ప్రభుత్వ అవసరాలకైనా కాంట్రాక్టర్ అనుమతి పొందాల్సిందే. ఏఎమ్మార్పీ ప్రధాన కాల్వ వంద కిలోమీటర్ల పొడవున ఏళ్ల తరబడి ఇవేమిలేకుండా ఎవరికి ఇష్టం వచ్చినట్లు వారు మట్టి తరలిస్తున్నారు. ప్రధాన కాల్వ తవ్వకంతో అప్పట్లో డీప్‌కట్ జరిగిన చోట 20మీటర్ల ఎత్తువరకు మట్టిదిబ్బలు కూడా అక్కడక్కడ ఉన్నాయి. 20ఏళ్లుగా మట్టి తరలిస్తుండడంతో చాలా వరకు మట్టి దిబ్బలు మాయమవుతున్నాయి. జేసీబీ, టిప్పర్ల ద్వారా మట్టి తరలింపు జరుగుతున్నా అధికారులు చోద్యం చూస్తున్నారు. ఇటీవల కాలంలో ఒకరు మాత్రమే అనుమతి తీసుకున్నారని ఏఎమ్మార్పీ గుర్రంపోడు డివిజన్ అధికారులు పేర్కొంటున్నారు. ప్రధాన కాల్వ వెంట ముందుగా మట్టి తరలించి ఆ తర్వాత అక్రమాలకు పాల్పడుతున్నారు. దీంతో ప్రధాన కాల్వ వెంట దారి మినహా మట్టి పోసేందుకు అప్పట్లో ప్రభుత్వం భూ సేకరణ జరిపిన భూమి రికార్డులకు మాత్రమే పరిమితమైంది. ఏఎమ్మార్పీ ప్రాజెక్టులో వంద కిలోమీటర్ల ప్రధాన కాల్వలో గుర్రంపోడు డివిజన్ పరిధిలోని ప్రధాన కాల్వ 37వ కిలోమీటర్ నుంచి 82కిలోమీటర్ వరకు 45కిలోమీటర్ల మేర ప్రధాన కాల్వ ఇక్కడే అధికంగా ఉంది. డివిజన్ పరిధిలో 2500 ఎకరాల మేరకు భూసేకరణ జరగగా ప్రధాన కాల్వ మేజర్ కాల్వల వెంట సుమారు 300ఎకరాల వరకు ఆక్రమణలో ఉందని తెలుస్తోంది.



వాహనాలు సీజ్ చేస్తాం

ఏఎమ్మార్పీ కాల్వల వెంట రాత్రి వేళలో మట్టి టిప్పర్‌లు, ఎక్స్‌కవేటర్ల ద్వారా తరలిస్తున్నట్లు సమాచారం ఉంది. సిబ్బంది కొరత ఉన్నప్పటికీ నిఘా ఉంచి అనుమతులులేకుండా తరలిస్తే ఆ వాహనాలు సీజ్ చేస్తాం. మట్టి తొలగించి తాత్కాలికంగా భూమిని తమ భూమిలో పక్క రైతులు కలిపేసుకొని ఆక్రమించుకున్న ఆ భూమిపై వారికి హక్కులు ఉండవు. భూభారతి ద్వారా లెక్కలు తీసి ప్రభుత్వం తిరిగి స్వాధీనం చేసుకుంటుంది.

● శ్రీనివాసరావు, ఏఈ

విద్యార్థులు అన్నిరంగాల్లో రాణించాలి

● సాగర్‌లో బీసీ గురుకులాల స్పోర్ట్స్ మీట్ ప్రారంభం



విద్యార్థుల ప్రదర్శన

నాగార్జునసాగర్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు అన్నిరంగాల్లో రాణించాలని సైబర్ సీఐ, సాగర్ బీసీ గురుకుల పాఠశాల పూర్వ విద్యార్థి శ్రవణ్‌కుమార్ అన్నారు. నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ హిల్‌కాలనీలోని మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకుల పాఠశాలలో నిర్వహించే బీసీ గురుకులాల స్పోర్ట్స్‌మీట్ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం క్రీడా జ్యోతిని వెలిగించి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకరావాలని కోరారు. తాను కూడా 2001 లో సాగర్ బీసీ గురుకుల పాఠశాలలో పదోతరగతి చదివానని, ప్రస్తుతం సీఐగా విధులు నిర్వహిస్తున్నాని తెలిపాడు. తాను చదువుకున్న పాఠశాలకే తాను ముఖ్యఅతిథిగా రావడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల సంఘం సభ్యుడు శివాజీ రాజ్, నాట్కో ఫార్మా అధికారి చంద్రశేఖర్, ప్రిన్సిపాల్ రవికుమార్, ఏటీపీ సంతోష్, పీడీలు జ్యోతి, అరుణ, పీఈటీలు నర్సింహ, జానకీరామ్, వార్డెన్ అజయ్‌చంద్ర, ఉపాధ్యాయులు, 16 పాఠశాలల నుంచి క్రీడాకారులు పాల్గొన్నారు.

మొదటి రోజు విజేతలు వీరే..



క్రీడలను ప్రారంభిస్తున్న అధికారులు, ప్రతినిధులు

లాంగ్ జంప్‌లో మూసీ బీసీ గురుకుల పాఠశాల విద్యార్థి భరత్‌చంద్ర (ప్రథమ), షార్ట్‌పుట్‌లో అనంతారం గురుకుల విద్యార్థి అరవింద్ (ప్రథమ) స్థానం, 100మీటర్ల పరుగు పందెంలో నాగార్జునసాగర్ విద్యార్థి గణేష్ (ప్రథమ), ఖోఖో పోటీల్లో నాగార్జునసాగర్ పాఠశాల (ప్రథమ) స్థానంలో నిలిచింది. వాలీబాల్‌లో సాగర్ బీసీ గురుకుల పాఠశాల జట్టు గెలుపొందగా, కబడ్డీ పోటీల్లో అనంతారం జట్టు విజేతలుగా నిలిచాయి.



స్వర్ణగిరి ఆలయంలో కార్తీక దీపోత్సవం



ఆలయంలోని విష్ణుమూర్తి శేషతల్పం

స్వర్ణగిరిలో ఆధ్యాత్మిక శోభ

భువనగిరి టౌన్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా భువనగిరి పట్టణంలోని ఆధ్యాత్మిక క్షేత్రం స్వర్ణగిరిలో గురువారం నిర్వహించిన సంప్రదాయ పూజలతో భక్తజనం పులకించింది. సుప్రభాత సేవ, నిత్యారాధన, సువర్ణ బిందె తీర్థ అభిషేకం నిర్వహించారు. నిత్య కల్యాణోత్సవం, నైవేద్యం సమర్పణ, కర్పూర మంగళహారతులతో తిరుసేవ నిర్వహించారు. కార్తీక దీపోత్సవంతో ఆలయం నూతన శోభను సంతరించుకుంది. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.



కార్తీక దీపాలతో...

శాస్త్రోక్తంగా నిత్య పూజలు



ప్రాకార మండపంలో నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో నిత్య కైంకర్యాలు గురువారం పాంచారాత్రగమ శాస్త్ర రీతిలో నిర్వహించారు. ప్రధానాలయ నైరుతి దిశలో అష్టభుజి ప్రాకార మండపంలో ఉత్సవ మూర్తులను పట్టువస్త్రాలు, ముత్యాలు, బంగారు, వజ్రవైఢూర్యాలతో దివ్యమనోహరంగా అలంకరించిన అర్చకులు గజవాహన సేవలో తీర్చిదిద్ది వేద మంత్ర పఠనాలు, మంగళవాయిద్యాల నడుమ సేవోత్సవం నిర్వహించారు. ఉత్సవమూర్తులను కల్యాణ మండపంలో అధిష్ఠింపజేసి, విశ్వక్సేనుడి తొలిపూజలతో కల్యాణ తంతు కొనసాగింది. ప్రభాతవేళ గర్భాలయంలో స్వామిఅమ్మవారిని సుప్రభాత సేవతో మేల్కొల్పిన అర్చకులు నిజాభిషేకం, నిత్యార్చనలు నిర్వహించారు. పాతగుట్ట ఆలయంలో నిత్య పూజలు సంప్రదాయ రీతిలో జరిగాయి. వివిధ విభాగాల ద్వారా ఆలయ ఖజానాకు రూ. 21,04,961 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఇన్‌చార్జి ఈవో గుగులోతు రవి తెలిపారు.

వైభవంగా లక్ష్మీనరసింహుడి కల్యాణం

మఠంపల్లి: మట్టపల్లి లక్ష్మీనరసింహుడి క్షేత్రంలో స్వామివారి నిత్య కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయంలో విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, రక్షాబంధనం, రుత్విగ్వరణం, పంచగవ్య ప్రాసన అనంతరం స్వామివారికి మాంగాళ్యధారణ తలంబ్రాలతో కల్యాణం నిర్వహించారు. కార్తీక మాసం సందర్భంగా పార్వతి రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో గణపతి పూజ, పుణ్యాహవచనం, మహాన్యాసపూర్వక, రుద్రాభిషేకం, సహస్రనామార్చన నిర్వహించారు.

ఉత్సవాలను విజయవంతం చేయాలి

సీపీఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జాతీయ కార్యదర్శి వెంకట్‌రెడ్డి

దేవరకొండ, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): సీపీఐ ఏర్పడి వందేళ్ల పూర్తయిన సందర్భంగా నిర్వహిస్తున్న ఉత్సవాల్లో భాగంగా డిసెంబరు 20వ తేదీన ఖమ్మం జిల్లాలో నిర్వహించే ముగింపు ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆ పార్టీ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి పిలుపునిచ్చారు. నల్లగొండ జిల్లా దేవరకొండ పట్టణంలోని పల్లా పర్వత్‌రెడ్డి భవన్‌లో గురువారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. పార్టీ వందేళ్ల ఉత్సవాలు కాన్పూరులో గతేడాది డిసెంబరు 26వ తేదీన ప్రారంభమైనట్లు పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ఉత్సవాలు నిర్వహించినట్లు వివరించారు. ఎమ్మెల్సీ, పార్టీ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా కమ్యూనిస్టులు మరింతగా బలపడాలని కోరారు. సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్లా నర్సింహారెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరిరావు, పల్లా దేవేందర్‌రెడ్డి, మైనొద్దిన్, తూం బుచ్చిరెడ్డి, వెంకటరమణ, సుదర్శన్‌రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, వెంకటయ్య, జయరాములు, అంజనేయులు, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞాన్ యూనివర్సిటీ ఛాన్సలర్‌గా సుబ్బారావు



సుబ్బారావును అభినందిస్తున్న లావు రత్తయ్య

భూదాన్‌పోచంపల్లి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): విజ్ఞాన్ యూనివర్సిటీ దేశ్ ముఖి నూతన ఛాన్సలర్‌గా డాక్టర్ పావులూరి సుబ్బారావు నియమితుల య్యారు. ఆయన చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య నుంచి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా విజ్ఞాన్ సంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య మాట్లాడుతూ డాక్టర్ పావులూరి సుబ్బారావు ప్రస్తుతం హైదరాబాద్‌లోని అనంత్ బయోటెక్నాలజీస్ లిమిటెడ్ చైర్మన్‌గా, మేనేజింగ్ డైరెక్టర్‌గా ఉన్నారన్నారు. ఆంధ్రప్రదేశ్ స్పేస్ అకాడమీ అధ్యక్షుడిగా, ఉత్తరప్రదేశ్ ఎకనామికల్ కౌన్సిల్ సభ్యుడు లాంటి కీలక హోదాల్లో ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో వైస్ చాన్సలర్ కల్నల్, ప్రొఫెసర్ పి నాగభూషణ్, సీఈవో డాక్టర్ మేఘన కూరపాటి, విజ్ఞాన్స్ వర్సిటీ అడ్వైజర్ మాలకొండయ్య, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ దిరిశాల విజయరాము ఉన్నారు.

ఆంధ్రజ్యోతి * భువనగిరి ఆలేరు
8 www.andhrajyothy.com శుక్రవారం 7 నవంబరు 2025

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

భువనగిరి టౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మరమ్మతు పనుల కోసం శుక్రవారం భువనగిరి పట్టణంలోని పలు ప్రాంతాల్లో తాత్కాలికంగా విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో టౌన్ ఏఈ పి.సాయికృష్ణ తెలిపారు. జగదేవ్‌పూర్ రోడ్డు, పోలీస్ స్టేషన్, రైతు బజార్, తాతానగర్, పాత శిల్పాహోటల్, ఇంటిగ్రేటెడ్ మా ర్కెట్, ఎల్‌బీసీ కార్యాలయం, వినాయక చౌరస్తా, ఎస్‌వీ హోటల్ ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

మార్కెట్ ఇన్‌చార్జి కార్యదర్శిగా వెంకట్‌రెడ్డి

మోత్కూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మోత్కూరు మార్కెట్ కార్యదర్శి ఉమామహేశ్వర్‌రావును డిప్యూటేషన్‌పై కొండకండ్ల మార్కెట్ కార్యదర్శిగా వెళ్లారు. ఆయన స్థానంలో హాలియా మార్కెట్ కార్యదర్శి జె.వెంకట్‌రెడ్డికి మార్కెట్ కార్యదర్శి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. గురువారం వెంకట్‌రెడ్డి మోత్కూరు మార్కెట్ ఇన్‌చార్జి కార్యదర్శిగా బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా వెంకట్‌రెడ్డిని మార్కెట్ ఛైర్‌పర్సన్ నూనెముంతల విమల వెంకటేశ్వర్లు, వైస్‌ఛైర్మన్ లింగాల నర్సిరెడ్డి సన్మానించారు.

అలుగునీటి కాల్వ ఏర్పాటుకు ప్రణాళిక



గతంలో వచ్చిన వరదలకు చౌటుప్పల్ బస్ స్టేషన్‌లోకి చేరిన నీరు(ఫైల్ ఫొటో)

చౌటుప్పల్ టౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): చౌటుప్పల్ పట్టణంలోని ఊర చెరువు అలుగు నీరు సజావుగా ముందుకు వెళ్లేందుకు గాను శాశ్వత పరిష్కారం కోసం ఖచ్చితమైన ప్రణాళికలను సిద్ధం చేస్తున్నట్టు మునిసిపల్ కమిషనర్ గుత్తా వెంకట్రామ్‌రెడ్డి, ఐబీ ఎస్ఈ జి.శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఆదేశాలతో గురువారం కమిషనర్ వెంకట్రామ్‌రెడ్డి, ఐబీ ఎస్ఇ జి. శ్రీనివాస్ రెడ్డి, ఈఈ మనోహర్, మునిసిపల్ ఏఈఈ నితీష్‌కుమార్‌రెడ్డి పట్టణంలో పర్యటించారు. గతంలో చెరువు నిండి అలుగు పోసిన సందర్భాల్లో పట్టణంలోని పలు కాలనీలు నీట మునగడం, రాకపోకలకు తీవ్ర అంతరాయం కలగడం, ఇళ్లతో పాటు బస్ స్టేషన్, పోలీస్ లలోకి వరద నీరు చేరడం వంటి సంఘటనలను అధికారుల బృందం పరిగణలోకి తీసుకుని పరిశీలన చేసింది. చెరువు అలుగు నుంచి వరద నీరు ప్రవహించే ఆర్టీసీ బస్ స్టేషన్, హ్యాండ్లూమ్ మార్కెట్, గాంధీ పార్క్, పోలీస్ స్టేషన్, రామ్‌నగర్, వలిగొండ రోడ్డు కల్వర్టు, జయభూమి కాలనీ, అమ్మా నాన్న ఆశ్రమం మీదుగా తాళ్ల సింగారం సమీపంలోని దివి చెరువు వరకు సుమారు రెండున్నర కిలోమీటర్ల పొడవున అధికారులు నడుచుకుంటు వెళ్లి వరద ప్రవాహ ప్రాంతాలను పరిశీలించారు.


చౌటుప్పల్ పట్టణంలోని వరద కాల్వను పరిశీలిస్తున్న అధికారులు

అలుగు నీటితో పాటు ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వరద నీరు సమీపంలోని కాలనీల్లోకి వెళ్లకుండా నేరుగా దిగువకు ప్రవహించేందుకు అనువుగా కాల్వ నిర్మాణం చేయడం, వరద కాల్వ, బఫర్ జోన్‌లలో అక్రమ నిర్మాణాలు చేపట్టకుండా పకడ్బందీగా తీసుకోవలసిన చర్యలు తదితర అంశాలపై అధికారులు సమీక్షించారు. అత్యధిక వర్షపాత నమోదు, చెరువు నిండడం, కాలనీలు మునగడం, ప్రజలకు ఇబ్బందులు జరగడం వంటి అనేక పరిణామాలకు శాశ్వతంగా చెక్ పెట్టాలని ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి చేసిన సూచనలను పరిగణలోకి తీసుకున్న అధికారులు లోతుగా అధ్యయనం చేశారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి అంచనాలను రూపొందించి సమగ్రమైన నివేదికను ఎమ్మెల్యేకు అందజేస్తామని ఎస్ఈ శ్రీనివాస్ రెడ్డి, కమిషనర్ వెంకట్రామ్ రెడ్డి తెలిపారు.

బీఎస్పీ బలోపేతానికి కృషి

చౌటుప్పల్ రూరల్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): బీఎస్పీ బలోపేతానికి ప్రతీ ఒక్కరు ఆర్థికంగా సహకారం అందించాలని మందిం చాలని బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుడు నగరం చంద్రబోస్ తెలిపారు. గురువారం మండల పరిధిలోని కైతాపురంలో బహుజన ఉద్యోగులు, గ్రామస్థుల వద్ద విరాళాలు సేకరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జనకల్యాణ్ దివాస్ కార్యక్రమానికి ప్రజలు నుంచి మంచి స్పందన లభిస్తుందన్నారు. 2026 జనవరి15న జనకల్యాణ్ దివస్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు పరమేశ్, మాద రమేశ్, గడ్డమీది బాబు, కె వెంకటేశ్, నర్సింహ పాల్గొన్నారు.

దేవాదాయశాఖ పరిధిలోకి తీసుకురావాలి

వలిగొండ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : భీమలింగేశ్వర స్వామి పుణ్యక్షేత్రాన్ని దేవాదాయశాఖ పరిధిలోకి తీసుకురావాలని బీసీ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వరికుప్పల మధు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గురువారం విలేకరులతో మాట్లాడుతూ సంగెం గ్రామంలో కొలువుదీరిన గౌరీసమేత భీమలింగేశ్వర స్వామి పుణ్యక్షేత్రాన్ని ప్రతి సంవత్సరం కార్తీక పౌర్ణమికి రాష్ట్రం నలుమూలల నుంచి వేల సంఖ్యలో భక్తులు తరలివస్తారని తెలిపారు.

గీత కార్మికులకు పెండింగ్ ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి

మోత్కూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): గీత కార్మికులకు చెల్లించాల్సిన ఎక్స్‌గ్రేషియాను వెంటనే చెల్లించాలని గీత పనివారల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం జిల్లా వ్యాప్తంగా ఎక్సైజ్ కార్యాలయాల ఎదుట ధర్నాలు నిర్వహించారు. మోత్కూరు ఎక్సైజ్ సీఐ కార్యాలయం ఎదుట నిర్వహించిన ధర్నాలో సంఘం జిల్లా అధ్యక్షుడు చాపల అంజయ్య మాట్లాడుతూ గీత కార్మికులు తాటి చెట్టుపై నుంచి పడి మరణించిన, అంగవైకల్యం పొందిన వారికి ఏళ్ల తరబడి ఎక్స్‌గ్రేషియా చెల్లించకపోవడంతో ఆ కుటుంబాలు రోడ్డున పడుతున్నాయన్నారు. గీత వృత్తిలో చనిపోయిన వారి కుటుంబానికి చెల్లిస్తున్న ఎక్స్‌గ్రేషియాను రూ.5లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచాలని, గాయపడిన వారికి రూ.2లక్షలు ఇవ్వాలని, మెడికల్ బోర్డు విధానం రద్దు చేసి, ప్రభుత్వ సివిల్ సర్జన్ పర్యవేక్షణలో సర్టిఫికెట్ ఇవ్వాలని, ప్రతి సొసైటీకి వన పెంపకానికి 560 జీవో ప్రకారం ఐదు నుంచి పదెకరాల భూమి కెటాయించాలని డిమాండ్ చేశారు. స్వాతంత్ర్య సమరయోధుడు, మాజీ పార్లమెంటు సభ్యుడు బొమ్మగాని ధర్మభిక్షం జీవత చరిత్రను పాఠ్యాంశంగా చేర్చాలని కోరారు. అనంతరం ఎక్సైజ్ సీఐ రవిచంద్రారెడ్డికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్ష, కార్యదర్శులు, బత్తిని శ్రీను, ఎడ్ల నరేష్, సొసైటీ అధ్యక్షుడు బీసు సత్తయ్య, బీసు సత్యనారాయణ, అన్నెపు వెంకట్, పుల్కరం మల్లేష్, బీసు మధు, బీసు రాములు పాల్గొన్నారు.


ఆత్మకూరు(ఎం): తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న కల్లుగీతకార్మికులు

ఆత్మకూరు(ఎం): స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిర్వహించిన ధర్నాలో గీత పనివారల సంఘం మండల అధ్యక్షుడు దుర్గపతి నర్సయ్య, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఉప్పల ముత్యాలు, మండల కార్యదర్శి మారుపాక వెంకటేశం, సహాయ కార్యదర్శి ఎండీ.నయీమ్, జిల్లా కౌన్సిల్ సభ్యుడు రాములు, మల్లేశం పాల్గొన్నారు.

యాదగిరిగుట్ట రూరల్: సంఘం రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కళ్లెం కృష్ణ, సంఘం మండల అధ్యక్షుడు గుండు వెంకటేష్ గౌడ్, బండి జంగమ్మ, కల్లెపల్లి మహేందర్, బబ్బూరి శ్రీధర్, పేరబోయిన పెంటయ్య, దూశెట్టి హరికృష్ణ, గుండ్లపల్లి లింగం, పచ్చిమట్ల నరేష్, స్వామి, అనంతుల నర్సింహగౌడ్, గోపగాని రాజు తదితరులు పాల్గొన్నారు.

రామన్నపేట: గీతపనివారల జిల్లా సహాయ కార్యదర్శి ఎర్ర రమేష్‌గౌడ్, సంఘం మండల అధ్యక్షులు గంగాపురం వెంకటయ్య, నాయకులు బాలగోని మల్లయ్య, బాలగోని నర్సింహ, బత్తుల సత్తయ్య, చెరుకు శివరాజ్, వెంకటేష్ ఉన్నారు.

మోటకొండూరు : గీత పనివారల సంఘం రాష్ట్ర కార్యదర్శి బొలగాని సత్యనారాయణ, జిల్లా సహాయ కార్యదర్శి గదగాని మాణిక్యం, మండల అధ్యక్షుడు పల్లె వెంకన్న, గడ్డం అంజయ్యగౌడ్, గాజుల ఎల్లయ్య, సీసా ఇస్తారి, మల్లేష్, తళ్లపల్లి వెంకటయ్య పాల్గొన్నారు.

అక్రమ కట్టడంపై సర్వే చేయాలి


ధర్నా నిర్వహిస్తున్న జంగారెడ్డిపల్లి గ్రామస్థులు

భువనగిరి (కలెక్టరేట్), నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): సీలింగ్ భూమిని సర్వేలో పక్కకు జరిపి ఆక్రమించుకుని ఇంటి నిర్మాణం చేస్తున్న వలిగొండ మాజీ జడ్పీటీసీ వాకిటి పద్మ అనంత రెడ్డి అక్రమ కట్టడంపై పారదర్శకంగా సర్వే నిర్వహించాలని జంగారెడ్డిపల్లి గ్రామస్థులు కోరారు. ఈమేరకు గురువారం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. అక్రమ కట్టడంపై అధికారుల తీరుకు వ్యతిరేకంగా నినాదాలు చేసిన అనంతరం కలెక్టర్ హనుమంతరావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్థులు కిష్టయ్య, నర్సింహులు, ఇద్దయ్య, శ్రీనివాస్, దయాకర్, నరేష్, యాదయ్య, స్వామి, అంజిరెడ్డి, స్వామి ఉన్నారు.

సీసీఐ కఠిన నిబంధనలు ఎత్తివేయాలి: సీపీఎం


మోత్కూరు: పత్తిచేనును పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

మోత్కూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): పత్తి కొనుగోలు సందర్భంగా రైతులకు ఇబ్బంది కలిగించే కఠిన నిబంధనలను సీసీఐ వెంటనే ఎత్తి వేయాలని సీపీఎం మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని రాగిబావి గ్రామంలో వర్షాలకు దెబ్బతిన్న పత్తి చేలను సీపీఎం నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకవైపు వర్షాలకు పత్తి చేలు దెబ్బతిని దిగుబడి తగ్గిపోగా మరోవైపు సీసీఐ కఠిన నిబంధనలు పెట్టి పత్తి కొనడం లేదని విమర్శించారు. కపాస్ కిసాన్ యాప్ ద్వారా స్లాట్ బుక్ చేసుకోవాలంటే నిరక్షరాస్యులైన రైతులు, స్మార్ట్ ఫోన్ లేని రైతులు ఎలా బుక్ చేసుకుంటారని ఆయన ప్రశ్నించారు. సీసీఐ కఠిన నిబంధనలు తొలగించి ప్రతి రైతు వద్ద పత్తికొనాలన్నారు. మండల కమిటి సభ్యులు దడిపల్లి ప్రభాకర్, పానుగుల రమేష్, మెండు శేఖర్‌రెడ్డి, చంద్రయ్య ఆయన వెంట ఉన్నారు.

ఫసల్ బీమా పథకాన్ని అమలు చేయాలి: బీజేపీ

మోత్కూరు/అడ్డగూడూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫసల్ బీమా యోజన పథకాన్ని రాష్ట్రంలో రాష్ట్ర ప్రభుత్వం కూడా అమలు చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు గుదే మధుసూదన్ కోరారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఫసల్ బీమా యోజన పథకం అమలు చేసి ఉంటే మొంథా తుఫాన్‌తో పంటలు దెబ్బతిని నష్టపోయిన రైతులకు బీమా సొమ్ము అంది ఎంతో మేలు జరిగేదన్నారు. పంటలు దెబ్బతిని నష్టపోయిన రైతులకు ప్రభుత్వం ఎకరాకు రూ.50వేల చొప్పున నష్టపరిహారం చెల్లించాలన్నారు. నాయకులు ఏనుగు జితేందర్‌రెడ్డి, బీమిడి తిరుమల్‌రెడ్డి ఆయన వెంట ఉన్నారు. అడ్డగూడూరు మండల కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షుడు ననుబోతు సైదులు యాదవ్ మాట్లాడారు.

రహదారుల సమీపంలో వైన్సులను నిషేధించాలి


కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న అఖిలపక్ష నాయకులు

భూదాన్‌పోచంపల్లి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ప్రధాన రహదారులపై ఏర్పాటు చేసిన వైన్స్ దుకాణాలను వెంటనే ఎత్తివేయాలని, నూతనంగా మంజూరైన వైన్స్‌లను పట్టణానికి దూరంగా ఏర్పాటు చేసేట్లు చర్యలు తీసుకోవాలని పట్టణంలోని నేతాజీ యువజన సంఘం, వివేకానంద యువజన సంఘం, కల్లుగీత పారిశ్రామిక సంఘం, చేనేత కార్మిక సంఘం, పద్మశాలి మహాజన సంఘం, రాంనగర్ కాలనీ నాయకులు, పద్మశాలి చేనేత కార్మిక సంఘం, శాలివాహన సంఘం, పట్టణ రజక సంఘం, మత్స్య పారిశ్రామిక సంఘం తదితర కుల సంఘాల ప్రతినిధులు కలెక్టర్ హనుమంతరావును కోరారు. ఈమేరకు గురువారం కలెక్టరేట్‌లో వినతి పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు గునిగంటి రమేష్‌గౌడ్, సార బాలయ్యగౌడ్, శెట్టి శ్రీనివాస్ ముదిరాజ్, బొడిగె లింగంగౌడ్, వంగూరి రాజు, సీత శ్రీరాములు శ్రేష్టి, పాండు, మల్లేష్‌గౌడ్, పాల్గొన్నారు.

మోత్కూరు :పట్టణంలోని జన నివాసాల మధ్య వైన్స్ దుకాణాల ఏర్పాటుకు అనుమతి ఇవ్వవద్దని గురువారం పలువురు పట్టణ వాసులు మునిసిపల్ కమిషనర్ కె.సతీష్‌కుమార్‌కు, ఎక్సైజ్ సీఐ రవిచంద్రారెడ్డికి వినతి పత్రాలు అందజేశార కార్యక్రమంలో హెచ్.చందర్‌రావు, బీసు రాములు, ఎడ్ల నరేష్, కలిమెల నర్సయ్య, బుర్ర శ్రీను, బీసు మధు, మన్నెం అంజయ్య, ముత్తినేని రాజేష్, బొమ్మగాని ఉప్పలయ్య పాల్గొన్నారు.

భవిత సెంటర్‌లో లీగల్ ఎయిడ్ క్లినిక్ ఏర్పాటు

రామన్నపేట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని భవిత సాహిత్య విద్యా వనరుల కేంద్రంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆదేశాలానుసారం మనోన్యాయ్ కార్యక్రమంలో భాగంగా లీగల్ వలంటీర్లు బత్తుల గణేష్ హాజరై లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను పరిశీలించారు. విద్యార్థులకు కల్పించే వసతులు, సౌకర్యాలు, మౌలిక సదుపాయాలు పరిశీలించారు. విద్యార్థులకి, రిసోర్స్‌పర్సన్‌తో చర్చించి, లీగల్ సెల్ ఉపయోగాలు తెలిపారు. విద్యార్థులకి ఉన్న ఆధార్ కార్డు, సదరం సర్టిఫికెట్, పెన్షన్, బ్యాంక్ అకౌంట్‌లకి సంబంధించిన సమస్యల పరిష్కారం కోరారు. అనంతరం విద్యార్థులకి చేస్తున్న ఫిజియోథెరపీ సౌకర్యంను పరిశీలించారు.

పత్తి కొనుగోలుకు సీసీఐ కొర్రీలు

(5వ పేజీ తరువాయి)

పత్తి కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేశారు. రైతుల రాస్తారోకోతో రోడ్డుపై వాహనాలు నిలిచిపోవడంతో పోలీసులు వచ్చి సముదాయించి రైతులతో రాస్తారోకో విరమింపజేశారు. పోలీసులు, తహసీల్దార్ చెప్పినా బయ్యర్ పత్తి కొనడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.



నిబంధనలు సడలించి పత్తి కొనాలి

ఈ ఏడాది తడారకుండా వర్షాలు కురిసినందున పత్తిలో గతంలో కంటే కొంత తేమ శాతం ఎక్కువగా ఉంటున్నది. రైతులు పత్తి ఆరబెట్టి తీసుకొస్తున్నారు. సీసీఐ వారు పత్తిలో తేమ శాతం 8 నుంచి 12కు కాకుండా కనీసం 15 శాతానికి పెంచి పత్తి కొనాలి. లేదంటే రైతులు ప్రైవేటు వ్యాపారులకు తక్కువ ధరకు విక్రయించి నష్టపోతారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పత్తిలో తేమ శాతం పెంచేలా, అన్ని మిల్లుల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసేలా సీసీఐపై ఒత్తిడి తీసుకరావాలి.

-పేలపూడి వెంకటేశ్వర్లు, సింగిల్ విండో చైర్మన్, మోత్కూరు

అన్నదాతకు అష్టకష్టాలు

(5వ పేజీ తరువాయి)

మిల్లుల్లో మొదట పత్తి సేకరించిన తర్వాతే మిగతా వాటికి అనుమతించేలా సీసీఐ నిబంధనలు విధించింది. రైతులు గతంలో తమకు దగ్గరలో ఉన్న జిన్నింగ్ మిల్లులకు వెళ్లి పత్తిని విక్రయించే పరిస్థితి ఉండేది. ఈసారి ఆ పరిస్థితి లేదు. కపాస్ కిసాన్ యాప్‌లో సీసీఐ ఆయా జిల్లాల్లో ఎల్-1 కేటగిరీలో ఉన్న మిల్లుల జాబితాను మాత్రమే పొందుపరచడంతో రైతులు దూరమైనా, అక్కడే పత్తిని తరలించాల్సి వస్తోంది. ఒకటి, రెండెకరాల చిన్నచిన్న కమతాలు ఉండే రైతులు రవాణా ఖర్చులు భరించి దూరం వెళ్లి పత్తి విక్రయించాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. తేమ శాతం తగ్గగానే కొనుగోళ్లు వేగవంతం చేస్తామని జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి సబిత తెలిపారు.

34వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ

రైతులు కొనుగోలు కేంద్రాల్లో విక్రయించేందుకు ధాన్యం కల్లాలకు తరలించారు. వానాకాలంలో జిల్లాలో 2,82,897 ఎకరాల్లో వరి సాగుచేశారు. ఈ సారి వరి దిగుబడి రెట్టింపుస్థాయిలో మొత్తం 5లక్షలకు పైగా మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి అవుతుందని అధికారులు అంచనావేశారు. 3లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించాలన్న లక్ష్యాన్ని జిల్లాయంత్రాంగం నిర్ణయించింది. జిల్లాలో 17 మండలాల్లో 325 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. జిల్లాలో మొత్తం 263 కొనుగోలు కేంద్రాల ద్వారా 4,350 మంది రైతుల నుంచి 34,493 మెట్రిక్‌టన్నుల ధాన్యాన్ని సేకరించారు. అయితే కొనుగోలు కేంద్రాల్లో వేల మెట్రిక్‌టన్నుల ధాన్యం ఆరబోసి పెట్టారు. వర్షంతో తేమ శాతం తక్కువగా ఉండటంతో ఎండకోసం రైతులు ఎదురుచూస్తున్నారు. రెండురోజుల పాటు వర్షం కురువకుంటే కొనుగోళ్లు వేగవంతమవుతాయి. రైతుల ఇబ్బందులరీత్యా కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. జిల్లాలోని అన్ని కేంద్రాల్లో వారం రోజుల్లో కొనుగోళ్లు ఊపందుకోనున్నట్టు పౌరసరఫరాల శాఖ మేనేజర్ డి.హరికృష్ణ తెలిపారు.

పంటకోసే పరిస్థితి లేదు



వర్షాల కారణంగా పత్తి పొలాల్లోకి వర్షం నీరు చేరుతోంది. పత్తిని కోసేందుకు కూడా చాలా ఇబ్బందికరంగా ఉంది. ఎకరాకు దాదాపు రూ.30వేలు ఖర్చుచేసి పత్తి పంటను సాగుచేశాం. మరో ఏడు ఎకరాలు కౌలుకు తీసుకున్నా. వర్షాల కారణంగా పంట దిగుబడి తగ్గనుంది. ఎలాంటి షరతుల్లేకుండా పత్తి కొనుగోలు చేయాలి. ఈసారి పత్తి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ప్రభుత్వం వీరిని ఆదుకోవాలి.

-ఎన్.శేఖర్, రైతు, వీరవెల్లి, భువనగిరి మండలం

డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కేటాయించాలి


సమావేశంలో మాట్లాడుతున్న దామోదర్‌రెడ్డి

భువనగిరి గంజ్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఇళ్లు లేని నిరు పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను వెంటనే కేటాంచాలని సీపీఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని గురువారం సీపీఐ జిల్లా కార్యాలయంలో పట్టణ ముఖ్య నాయకుల సమావేశం చింతల మల్లేషం అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భువనగిరి పట్టణంలో సింగన్నగూడెంలో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను ప్రభుత్వం ఎంపిక చేసి లబ్ధిదారులకు వెంటనే అప్పజెప్పాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బోలగాని సత్యనారాయణ, కార్యవర్గ సభ్యులు ఎండీ ఇమ్రాన్, పుట్ట రమేష్, సోమన సబిత, గనబోయిన వెంకటేష్, శోభన్‌బాబు, సత్తయ్య, సామేల్ పాల్గొన్నారు.

ఆలేరు : గత అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలకు అనేక హామీలు ఇచ్చి వారి ఓట్లతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆ హామీలన్నీ వెంటనే అమలు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం ఆలేరులో జరిగిన సీపీఐ మండల కౌన్సిల్ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. ఈనెల 26న ఖమ్మం జిల్లాలో నిర్వహిస్తున్న శతజయంతి ఉత్సవాల ముగింపు సభకు పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా సహాయ కార్యదర్శి సత్యనారాయణ, జిల్లా కార్యవర్గ సభ్యులు వెంకటేష్, సత్తయ్య, పార్టీ మండల కార్యదర్శి చౌడబోయిన కనకయ్య, నాయకులు రాములు, ప్రవీణ్, ఆంజనేయులు, శ్రీనివాస్‌రాజు, రవి, శ్రీను తదితరులు ఉన్నారు.

విద్యాసంస్థల సమ్మెకు న్యూడెమోక్రసీ మద్దతు

ఆలేరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లింపులో రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న మొండి వైఖరిని నిరసిస్తూ ప్రైవేటు విద్యా సంస్థలు చేపట్టిన సమ్మెకు సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ సంపూర్ణ మద్దతు తెలుపుతుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పి.సూర్యం ఒక ప్రకటనలో తెలిపారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు సంబంధించిన బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేసి, విద్యా సంస్థలు చేపట్టిన బంద్‌ను విరమింపజేయాలని డిమాండ్ చేశారు. ఫీజు రీయంబర్స్‌మెంట్ మూడేళ్లుగా ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టడం వల్ల ప్రైవేటు కళాశాలలకు చెందిన లక్షలాది మంది విద్యార్థులు, తల్లిదండ్రులు ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు.

బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలి


భువనగిరిలో మౌనప్రదర్శనలో పాల్గొన్న నాయకులు

భువనగిరి (కలెక్టరేట్)/భువనగిరి గంజ్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): విద్యా, ఉద్యోగాలు, స్థానిక సంస్థలలో 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని జేసీ రిజర్వేషన్ సాధన సమితి రాష్ట్ర నాయకులు వినోద్ యాదవ్, జిల్లా కన్వీనర్ శాంతికుమార్ కోరారు. ఈ మేరకు 42 శాతం రిజర్వేషన్ అమలుపై గురువారం జిల్లా కలెక్టర్ హనుమంతరావుకు వినతిపత్రం అందజేసి, మాట్లాడారు. కార్యక్రమంలో బీసీ సాధన సమితి రాష్ట్ర నాయకులు బట్టు రామచంద్రయ్య, నరేందర్, జిల్లా నాయకులు లింగస్వామి, గాలయ్య, రాకేష్, శ్రీకాంత్, కిరణ్, ఉప్పలయ్య, స్వామి తదితరులున్నారు.

● జిల్లా కేంద్రంలోని పూలే విగ్రహానికి పూలమాలలు వేసి, అంబేద్కర్ విగ్రహం వద్ద బీసీ జేఏసీ ఆధ్వర్యంలో మౌన దీక్ష చేపట్టారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కొత్త నరసింహస్వామి, కార్యనిర్వహక అధ్యక్షులు గొట్టిపాముల బాబురావు, మాజీ మున్సిపల్ చైర్మన్ బర్రె జహంగీర్, బీసీ జేఏసీ సమన్వయకర్త మెరుగు మధు, మాటూరి అశోక్, అతకం లక్ష్మీనారాయణగౌడ్, దుబ్బ రామకృష్ణ, ఇటుకల దేవేందర్, కొంగరి లక్ష్మీనారాయణ, సుర్వి శ్రీనివాస్, దేవరకొండ నరసింహచారి, ఎండీ ఇమ్రాన్, సామల శోభన్ బాబు పాల్గొన్నారు.

మోత్కూరు : మండల కేంద్రంలో బీసీ జేఏసీ నాయకులు గురువారం మహాత్మ జ్యోతిరావుపూలే విగ్రహానికి వినతి పత్రం అందజేసి కొంత సేపు మౌనం పాటించారు. కార్యక్రమంలో నాయకులు కలిమెల నర్సయ్య, ఎడ్ల నరేష్, అన్నెపు వెంకట్, బొమ్మగాని ఉప్పలయ్య, పుల్కరం మల్లేషం, సత్యనారాయణ, గొలుసుల యాదగిరి, చాపల అంజయ్య, బీసు సత్తయ్య, ఉప్పలయ్య పాల్గొన్నారు.

ఆలేరు : తెలంగాణ రాష్ట్రంలో త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లను వెంటనే అమలు చేయాలని బీసీ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు పేరుపు రాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఆలేరు బస్టాండ్ సమీపంలో ఉన్న మహాత్మాజ్యోతిరావు, సావిత్రి దంపతుల విగ్రహాల వద్ద బీసీ సంఘం చేపట్టిన మౌనదీక్ష కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సీపీఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి, కార్యక్రమానికి సంఘీభావం ప్రకటించి పాల్గొనడం గమనార్హం. నాయకులు సత్తయ్య, బి.సత్యనారాయణ, వెంకటేష్, కనకయ్య, ఆంజనేయులు, ప్రవీణ్, పరుశరాములు, శ్రీదేవి, సరల, శ్రీను, స్వామి పాల్గొన్నారు.

వలిగొండ: మండల కేంద్రంలోని స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద అఖిలపక్షం ఆధ్వర్యంలో మౌన దీక్ష చేపట్టారు. బీసీ సంఘం మండల అధ్యక్షుడు సాయిని యాదగిరి, సీపీఎం మండల కార్యదర్శి సిరిపంగి స్వామి, సీపీఐ మండల సహాయ కార్యదర్శి యల్లంకి మహేష్, అఖిలపక్ష నాయకులు ఆంజనేయులు, వెంకటేశం, ముత్యాలు, రమేష్, సుదర్శన్, సాయికుమార్, మల్లయ్య, అంజయ్య, రాంచందర్ పాల్గొన్నారు.

జూబ్లీహిల్స్‌లో ఎన్నికల ప్రచారం

భువనగిరి టౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పాలనా తీరులో మార్పు కోసం జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలలో బీఆర్ఎస్‌ను గెలిపించాలని భువనగిరి మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి అన్నారు. గురువారం జూబ్లీహిల్స్‌లో బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతకు మద్దతుగా ఆయన గురువారం విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మాటలకు, అవినీతికి పరిమితమైన కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పేందుకు, కారు గుర్తుకు ఓటు వేయాలన్నారు. మునిసిపల్ మాజీ ఛైర్మన్ ఎనబోయిన ఆంజనేయులు, పట్టణ, మండల పార్టీ అధ్యక్ష కార్యదర్శులు, ఏవి కిరణ్‌కుమార్, జనగాం పాండు, రచ్చ శ్రీనివాస్‌రెడ్డి, నీలం ఓంప్రకాశ్ తదితర నాయకులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

బొమ్మలరామారం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఉపాధి పథకాన్ని ప్రతీ ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని డీఆర్‌డీవో సురేష్ అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన 15 ఉపాధి హామీ సామాజిక తనిఖీ కార్యాయంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పథకం ద్వారా ఎంతో మందికి పనులు దొరుకుతుందన్నారు. ప్రతి కుటుంబం ఆర్థికంగా ఎదగడం కోసం ఉపాధి పథకం ప్రతి కుటుంబానికి అండగా ఉంటుందన్నారు. అనంతరం 1 ఏప్రిల్ 2024 నుంచి 31 మార్చి 2025 వరకు జరిగిన ఉపాధి హామీ పనులపై జరిగిన తనిఖీ ప్రజావేదికలో 3 కోట్ల 61 లక్షల 36వేల 421 రూపాయలతో పనులు జరిగినట్లు తెలిపారు. పనుల వివరాలపై 29 అక్టోబరు 2025 నుంచి 05 అక్టోబరు 2025 వరకు గ్రామాలలో జరిగిన గ్రామ సభల ద్వారా స్వీకరించిన వివరాలతో గురువరం నిర్వహించిన సామాజిక తనిఖీ కార్యక్రమంలో నామమాత్రన అధికారుల ముందు గ్రామంలో నేను రోజు నుంచి సర్వే నిర్వహించిన వారు అధికారుల ముందు చదివి వినిపించారు. ఉదయం 10.30 గంటలకు ప్రారంభమైన సామాజిక ప్రజావేదిక రెండు గంటల లోపే ముగిసింది. కార్యక్రమంలో విజిలెన్స్ అధికారులు ఉపేందర్‌రావు, అసిస్టెంట్ మేనేజర్ ఆదిత్యవర్ధన్, అంబర్స్ మాన్ వీరమల్లు, ఎంపీడీవో రాజా త్రివిక్రమ్, ఈజీఎస్ ఏపీవో శ్రీలక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో 24గంటలు వైద్యం అందించాలి

యాదగిరిగుట్ట రూరల్/ వలిగొండ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 24గంటలు వైద్య సేవలు అందించాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి పేరబోయిన మహేందర్ డిమాండ్ చేశారు. గురువారం ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో స్థానిక ఆరోగ్య కేంద్రం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుట్ట మునిసిపాలిటి పరిధిలో సుమారు 20వేల జనాభా ఉందని దాంతోపాటుగా ప్రతిరోజు యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి వారిని దర్శించుకొనేందుకు వేలాదిమంది భక్తులు వచ్చి వెళ్తుంటారని వారికి ఆకస్మికంగా ఆరోగ్య సమస్యలు ఉత్పన్నమైతే వైద్యం కోసం అనేక కష్టాలు పడుతున్నారని చికిత్సకోసం భువనగిరి ఆసుపత్రికి వెళ్లేసరికి ఉన్నప్రాణం పోతుందని అన్నారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి కల్లెపల్లి మహేందర్, ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి కంబాల వెంకటేష్, నాయకులు అనంతుల నర్సింహ, గోపగాని రాజు, గుండు వెంకటేష్, పేరబోయిన మహేష్, సంగి అరవింద్ పాల్గొన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎల్లంకి మహేష్ డిమాండ్ చేశారు. గురువారం వలిగొండ పట్టణం, మండలంలోని వేములకొండ పీహెచ్‌సీలను ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో పరిశీలించారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ మండల అధ్యక్షుడు నర్సింహాచారి, కార్యదర్శి సుద్దాల సాయికుమార్, సహాయ కార్యదర్శి నాగరాజు, నాయకులు సోమేష్, ప్రవీణ్ పాల్గొన్నారు.